

www.prajakalam.in
epaper.prajakalam.in

# ప్రజా కలం

తెలుగు దినపత్రిక

RNI NO.TELTEL/2010/33275

Digital Editions
http://prajakalam.com
epaper.prajakalam.com
paperboy.com, www.magzter.com


ప్రజాకలం పాఠకులకు, ప్రకటనదారులకు, అధికారులకు రాజకీయనాయకులకు, కార్యకర్తలకు సిబ్బందికి, మిత్రులకు, మా శ్రేయోభిలాషులకు

**వినాయక చవితి శుభాకాంక్షలు**

- ప్రజాకలం టీం


సోమవారం | 14-09- 2026 | సంపుటి: 17, సంచిక: 163, నిజామాబాద్, పేజీలు: 12, వెల: 3/- | ◆ ఎడిటర్: కలకొండ రామకృష్ణ ◆


## శుద్ధీకరణ పేరిట అంటరానితనపు జాడలా?

- రాజ్యాంగ పీఠికపై దాడిని సహించేది లేదు
- పసుపు నీళ్లతో రోడ్లను శుద్ధి చేయడం కుల వివక్షకు నిదర్శనం
- బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేయాలి: చిప్పల యాదగిరి



గజ్వేల్:13 సెప్టెంబర్ (ప్రజా కలం ప్రతినిధి)

ప్రజాస్వామ్య దేశంలో ప్రతి పౌరుడికి సమాన గౌరవం, స్వేచ్ఛ కల్పిస్తున్న రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా శుద్ధీకరణ పేరుతో పసుపు నీళ్లతో రహదారులను కడగడం సాంస్కృతిక దురహంకారానికి నిదర్శనమని దళిత సంఘాల ఐక్య కార్యాచరణ సమితి రాష్ట్ర కార్యదర్శి చిప్పల యాదగిరి ఆరోపించారు. ఆదివారం గజ్వేల్ పట్టణంలో విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ ఒక రాజకీయ ఆందోళనలో ఎస్సీ వర్గానికి చెందిన నాయకులు, కార్యకర్తలు నడిచిన ప్రాంతాన్ని అపవిత్రంగా భావించి పసుపు నీళ్లతో శుద్ధి చేయడం ఏ భావజాలానికి సంకేతమని ప్రశ్నించారు. రాజకీయ విభేదాలను రాజకీయంగానే ఎదుర్కోవాలి తప్ప,ఒక వర్గానికి చెందిన ప్రజల ఉనికినే అపవిత్రంగా చిత్రీకరించడం సమానత్వం, ఆత్మగౌరవానికి విరుద్ధమని అన్నారు.

**ఆవేశం కాదు.. రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం**

భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 17 అంటరానితనాన్ని నిషేధించిందని యాదగిరి గుర్తుచేశారు. ఆర్టికల్ 14 కల్పించిన సమానత్వ హక్కు, ఆర్టికల్ 21లోని గౌరవప్రదమైన జీవించే హక్కుల స్ఫూర్తిని ఇలాంటి చర్యలు దెబ్బతీస్తాయని పేర్కొన్నారు. "నిరసన తెలపడం ప్రజాస్వామ్యం కల్పించిన హక్కు. ఆ నిరసనను సిద్ధాంతపరంగా ఎదుర్కోవాలి. అంతేగానీ శుద్ధీకరణ పేరుతో రోడ్లపై పసుపు నీళ్లు చల్లడం సమర్థనీయం కాదు. కడగాల్సింది నేలను కాదు. కుల వివక్షతో కూడిన మనస్తత్వాలను'' అని ఆయన వ్యాఖ్యానించారు. కేసీఆర్ ఫామ్‌హౌస్ చుట్టూ పసుపు నీళ్లు చల్లిన ఘటనపై బాధ్యులపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనను కేవలం రాజకీయ వివాదంగా పరిగణించకుండా, అణగారిన వర్గాల ఆత్మగౌరవం, రాజ్యాంగ విలువలకు సంబంధించిన అంశంగా చూడాలని కోరారు.

**చట్టపరమైన చర్యలు తీసుకోవాలి**

కుల వివక్షను ప్రోత్సహించే లేదా అణగారిన వర్గాల గౌరవాన్ని కించపరిచే చర్యలపై ప్రభుత్వం, పోలీసులు చట్ట ప్రకారం స్పందించాలని యాదగిరి కోరారు. ఘటనకు బాధ్యులుగా పేర్కొంటున్న వారిపై విచారణ జరిపి, చట్టం వర్తిస్తే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కుల వివక్షకు తావులేని సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ రాజ్యాంగ విలువలను గౌరవించాలని, ప్రజల మధ్య సమానత్వాన్ని కాపాడేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

## ఆర్యవైశ్యుల సంక్షేమానికి

# ప్రభుత్వం అండ



- ఆర్థిక క్రమశిక్షణకు ఆర్యవైశ్యులు ప్రతీక
- హైదరాబాద్‌లో రోశయ్య విగ్రహం ఏర్పాటు చేస్తాం
- ఉప్పల్ భగాయత్‌లో ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవన్‌కు భూమి పూజ
- మీ సమస్యలను పరిష్కరిస్తాం:సీఎం రేవంత్‌రెడ్డి హామీ

ఉప్పల్, సెప్టెంబర్ 13 (ప్రజా కలం ప్రతినిధి)

ఆర్యవైశ్యులు కలిసికట్టుగా ఉంటే మరింత బలం చేకూరుతుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఆర్థిక క్రమశిక్షణకు ఆర్యవైశ్యులు ప్రతీకగా నిలుస్తున్నారని కొనియాడారు. సమాజంలోని సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామని హామీ ఇచ్చారు. ఉప్పల్ భగాయత్‌లో ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవన్ నిర్మాణానికి ఆదివారం సీఎం భూమి పూజ చేశారు. అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు.

**ఆర్థిక నిర్వహణలో ప్రత్యేక గుర్తింపు**

ఆర్యవైశ్యులు సౌమ్యులు, ఆత్మాభిమానం కలిగినవారని సీఎం అన్నారు. పేదరికం ఎదురైనా తమ కష్టాలను ఇతరులకు చెప్పుకోకుండా భరించే మనస్తత్వం వారిదని పేర్కొన్నారు. వ్యాపార రంగంలోనే కాకుండా ఆర్థిక వ్యవహారాల్లోనూ ఆర్యవైశ్యులు నైపుణ్యం చూపుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ హయాంలో గల్లాపెట్టె వ్యవహారాలను ఆర్యవైశ్యులకే అప్పగించేవారని గుర్తుచేశారు. ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన సలహాల కోసం వారిని సంప్రదించేవారని చెప్పారు.
ముఖ్యమంత్రులు మారినా కొణిజేటి రోశయ్య ఆర్థిక మంత్రిగా కొనసాగారని, ఆర్థిక నిర్వహణలో ఆయన చూపిన దూరదృష్టి, సమర్థత ప్రత్యేకమైనవని రేవంత్‌రెడ్డి ప్రశంసించారు.

**ఆకలి తీర్చే ధాతృత్వం**

ఆర్యవైశ్యులు వ్యాపారంతో పాటు సేవా కార్యక్రమాల్లోనూ ముందుంటారని సీఎం అన్నారు. ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టే ధాతృత్వం వారిలో ఉందని కొనియాడారు. అవసరమైనప్పుడు పేదలకు ఉదారంగా అప్పులు ఇచ్చి ఆదుకుంటారని పేర్కొన్నారు. సమాజ సేవలో ఆర్యవైశ్యుల పాత్ర అభినందనీయమన్నారు. మహాత్మా గాంధీ, అమరజీవి పొట్టి శ్రీరాములు ఆర్యవైశ్య సమాజానికి చెందినవారని సీఎం గుర్తుచేశారు. దేశ చరిత్రలో ఆర్యవైశ్యుల సేవలు చిరస్మరణీయమని అన్నారు.

**రోశయ్య సలహా ఇప్పటికీ గుర్తుంది**

మాజీ సీఎం కొణిజేటి రోశయ్యతో తనకున్న అనుబంధాన్ని రేవంత్‌రెడ్డి గుర్తుచేసుకున్నారు. తాను అసెంబ్లీలో దూకుడుగా మాట్లాడే సమయంలో ఆవేశాన్ని తగ్గించుకోవాలని రోశయ్య సూచించేవారని తెలిపారు.

'ఆవేశానికి ఆలోచన తోడైతే భవిష్యత్తు ఉంటుంది' అని ఆయన ఇచ్చిన సలహాను ప్రస్తావించారు. తాను రాజకీయాల్లో సుదీర్ఘకాలం కొనసాగుతానని రోశయ్య ముందుగానే గుర్తించారని చెప్పారు.

తరువాయి 2వ పేజీలో...



# సమ్మిళిత వృద్ధి వర్ధిల్లాలి

## సాంకేతికత, కీలక ఖనిజాలను ఆయుధాలుగా మార్చొద్దు

## ఇది ఉమ్మడి పురోగతికి, శ్రేయస్సుకు ఆటంకం

## 18వ బ్రిక్స్ సదస్సు ముగింపులో ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 13: సాంకేతికత, కీలక ఖనిజాలను 'ఆయుధాలుగా' మార్చడం ఉమ్మడి శ్రేయస్సుకు ఆటంకం కలిగిస్తుందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హెచ్చరించారు. బ్రిక్స్ దేశాలు పరస్పర సహకారంతో ఎదగాలని, గ్లోబల్ సౌత్ ఎదుర్కొంటున్న తీవ్ర సవాళ్లను పరిష్కరించాలని, మానవాళి కోసం వర్ధిల్లాలని పిలుపునిచ్చారు. సహకారం, సమ్మిళిత వృద్ధిగా 'బ్రిక్స్'వికసించాలని పేర్కొన్నారు. భారత్ ఆతిథ్యంలో ఢిల్లీలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా ప్రసంగించిన మోదీ.. ప్రపంచ సంఘర్షణలపై ఆందోళన వ్యక్తం చేశారు. సామాన్య ప్రజల జీవితాలపై వాటి ప్రభావాన్ని తగ్గించడానికి కూటమి కలిసి పనిచేయాలని కోరారు. గ్లోబల్ సౌత్‌లో అభివృద్ధి చెందుతున్న దేశాలు బ్రిక్స్‌ను ఎక్కువగా విశ్వసిస్తున్నాయన్నారు.
ఎందుకంటే వారి గొంతుక వినబడుతుందని, వారి అనుభవాలకు విలువ ఇవ్వబడుతుందని, పరిష్కారాలు వారిపై రుద్దకుండా, వారితో భాగస్వామ్యంతో రూపొందించబడతాయని మోదీ స్పష్టం చేశారు. ప్రపంచం ఎదుర్కొంటున్న సవాళ్లపై లోతుగా చర్చిస్తూ సాంకేతిక పరిజ్ఞానాన్ని స్వీకరించడంలో తాము సమ్మిళితత్వానికి ప్రాధాన్యత ఇచ్చామని పేర్కొన్నారు. కీలక ఖనిజాల ఎగుమతిపై చైనా ఆంక్షలు, ఉన్నత సాంకేతిక పరిజ్ఞానాన్ని పంచుకోవడానికి ఆ దేశ విముఖతపై పెరుగుతున్న ఆందోళనల నేపథ్యంలో ప్రధాని వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.

తరువాయి 2వ పేజీలో...

## కరెంటుకు ప్రత్యామ్నాయం

# సోలార్ విద్యుత్ బెస్ట్


- కరెంట్ బిల్లులు తగ్గించుకోవాలంటే సోలార్ విద్యుత్ వాడటమే ఉత్తమం
- సౌర విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించాలి
-సంగారెడ్డిలో భారత్ ఈవీ సోలార్ లిమిటెడ్ బ్రాంచ్ కార్యాలయాన్ని ప్రారంభించిన సందర్భం గా జగ్గారెడ్డి



సంగారెడ్డి ప్రతినిధి సెప్టెంబర్ 13( ప్రజా కలం):

సంగారెడ్డి పట్టణంలో భారత్ ఈవీ సోలార్ లిమిటెడ్ కంపెనీ బ్రాంచ్ కార్యాలయం ప్రారంభమైంది. జగ్గారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ, ప్రస్తుతం విద్యుత్ అవసరాలు పెరుగుతున్న నేపథ్యంలో సౌర విద్యుత్ వినియోగం ఎంతో అవసరమని అన్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు విద్యుత్ ఖర్చులను తగ్గించుకునేందుకు ప్రతి ఒక్కరూ సోలార్ విద్యుత్ వ్యవస్థల వైపు దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గృహ అవసరాల కోసం సోలార్ యూనిట్లు ఏర్పాటు చేసుకునే వారికి సబ్సిడీ సౌకర్యాన్ని కల్పిస్తున్నాయని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. భారత్ ఈవీ సోలార్ లిమిటెడ్ ద్వారా గృహ అవసరాలకు అనుగుణంగా ఒక కిలోవాట్ నుంచి పది కిలోవాట్ల వరకు వివిధ సామర్థ్యాలతో సోలార్ యూనిట్లు అందుబాటులో ఉన్నాయని కంపెనీ డిస్ట్రిబ్యూటర్లు ప్రసాద్, కళ్యాణ్ తెలిపారు. సబ్సిడీకి అర్హత ఉన్న వినియోగదారులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రయోజనాలు లభిస్తాయని పేర్కొన్నారు. సంగారెడ్డి పట్టణంలో బ్రాంచ్ కార్యాలయం ఏర్పాటు చేయడం ద్వారా స్థానిక ప్రజలకు సోలార్ విద్యుత్ వ్యవస్థలపై అవగాహన, సలహాలు మరియు సేవలు అందుబాటులోకి వస్తాయని వారు తెలిపారు. కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు, డిస్ట్రిబ్యూటర్లు, సంగారెడ్డి మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ హఫీజ్, కాంగ్రెస్ నాయకులు కూన సంతోష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.


## మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ ని కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపిన డాక్టర్స్ కాలనీ డివిజన్ అధ్యక్షులు నల్లెంకి ధన్ రాజ్ గౌడ్



మహేశ్వరం, సెప్టెంబర్ 13,(ప్రజా కలం)

ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ చైర్ పర్సన్ గా నియమితులైన మాజీ పార్లమెంట్ సభ్యులు మధుయాష్కి గౌడ్ ని టీపీసీసీ సభ్యులు దేప భాస్కర్ రెడ్డి, డాక్టర్స్ కాలనీ డివిజన్ అధ్యక్షులు నల్లెంకి ధన్ రాజ్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి చిలుక ఉపేందర్ రెడ్డి, ఆర్.కె పురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్న గణేష్ నేత, గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండి మధుసూదన్ రావ్, శ్రీ ఖిల్లా మైసమ్మ దేవాలయ మాజీ చైర్మన్ సురేష్, డివిజన్ జనరల్ సెక్రటరీ ఇమ్రాన్ అలీ, మాజీ వార్డ్ మెంబర్ జంగా రెడ్డి, యువజన కాంగ్రెస్ నాయకులు పెద్దపూర సైదులు, షేక్ అక్బర్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## కలం కౌంటర్












## ఆర్యవైశ్యుల సంక్షేమానికి ప్రభుత్వం అండ

మొదటి పేజీ తరువాయి...

రోశయ్య వ్యక్తిగత విమర్శలకు దూరంగా ఉండేవారని, రాజకీయాల్లో హుందాతనం, సంయమనం, విలువలు ఎలా ఉండాలో ఆయన జీవితం నేర్పుతుందని సీఎం అన్నారు. హైదరాబాద్‌తో తన అనుబంధం విడదీయరానిదని రోశయ్య చెప్పేవారని గుర్తుచేశారు.

**హైదరాబాద్‌లో రోశయ్య విగ్రహం**

రోశయ్య సేవలకు గుర్తింపుగా హైదరాబాద్‌లో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు సీఎం ప్రకటించారు. భావితరాలు ఆయన ప్రజాసేవను గుర్తుంచుకునేలా విగ్రహం ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవన్ నిర్మాణానికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు.

భవన నిర్మాణం పూర్తయిన తర్వాత అది ఆర్యవైశ్యుల సామాజిక, సాంస్కృతిక, సేవా కార్యక్రమాలకు ప్రధాన వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు.కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి, నిజామాబాద్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, మాజీ ఎమ్మెల్యే గణేశ్ గుప్తా, మాజీ ఎమ్మెల్సీ దయానంద్ గుప్తా, మాజీ ఎంపీ, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మధు యాష్కీ, మందమల పరమేశ్వర్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు వజ్రేశ్ యాదవ్, ఆర్యవైశ్య సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## ముస్తాబైన మండపాలు

## వినాయక చవితి నవరాత్రి వేడుకలు

మెట్ పల్లి టౌన్ ప్రతినిధి సెప్టెంబర్ 13 (ప్రజాకలం) సెప్టెంబర్ 13: వినాయక చవితి నవరాత్రి వేడుకలకు పట్టణంలో ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న వినాయక మండపాలు భక్తులను ఆకట్టుకునేలా ముస్తాబవుతున్నాయి. మండపాలతో పాటు ప్రధాన రహదారులు, వీధుల్లో రంగురంగుల విద్యుత్ దీపాలంకరణలు చేపడుతున్నారు. ప్రతి ఏటా వినూత్న రీతిలో మండపాలను ఏర్పాటు చేస్తున్న నిర్వాహకులు ఈసారి కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచేలా ఏర్పాట్లు చేస్తున్నారు. వివిధ సెంటర్లలో ఏర్పాటు చేస్తున్న మండపాల్లో భారీ వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు ఏర్పాట్లు పూర్తవుతున్నాయి. పట్టణంలోని పలు ఆలయాల్లోనూ ప్రత్యేక మండపాలను ఏర్పాటు చేస్తున్నారు. ఆలయ కమిటీల ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

## మట్టి వినాయకులే ముద్దు.. పర్యావరణానికి రక్ష..

### అమీన్‌పూర్‌లో నందారం నరసింహ గౌడ్ ఆధ్వర్యంలో మట్టి విగ్రహాల పంపిణీ..

పటాన్‌చెరు, సెప్టెంబర్ 13 (ప్రజా కలం) ప్రతినిధి

పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయక విగ్రహాలనే ప్రతిష్ఠించి, కాలుష్యరహిత వాతావరణాన్ని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని




అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ ఉపాధ్యక్షుడు నందారం నరసింహ గౌడ్ పిలుపునిచ్చారు. అమీన్‌పూర్ బీరంగూడ డివిజన్ పరిధిలోని లక్ష్మీ సాయి మెడోస్, మధురానగర్ కాలనీలలో స్థానికులతో కలిసి మట్టి గణపతి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నందారం నరసింహ గౌడ్ మాట్లాడుతూ, వినాయక చవితిని భక్తిశ్రద్ధలతో పాటు పర్యావరణహితంగా జరుపుకోవాలని సూచించారు. రసాయనాలు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలతో జల వనరులు కలుషితమై మూగజీవాలు, మానవ జీవనానికి ముప్పు ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. పూర్వీకులు పాటించిన సంప్రదాయ పద్ధతిలో మట్టితో తయారు చేసిన విగ్రహాలను పూజించడం భారతీయ సంస్కృతిలో భాగమని తెలిపారు. ప్రతి ఇంటిలో మట్టి వినాయకుడిని ప్రతిష్ఠించి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు,నందారం సందీప్ గౌడ్, సంక్షేమ సంఘాల ప్రతినిధులు, స్థానిక నాయకులు, మహిళలు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు..

## మట్టి గణపతే ముద్దు..

### -అల్విన్ కాలనీలో మట్టి గణపతుల పంపిణీ.. ఆదిత్యరెడ్డి పిలుపు..

పటాన్‌చెరు, సెప్టెంబర్ 13 (ప్రజా కలం) ప్రతినిధి

పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయక విగ్రహాల వినియోగాన్ని ప్రోత్సహిస్తూ జేపీ కాలనీ డివిజన్ పరిధిలోని అల్విన్ కాలనీలో మట్టి గణపతుల ఉచిత పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. టీమ్ పీఏఆర్ ఆధ్వర్యంలో ఆదివారం అల్విన్ కాలనీలోని మల్లన్న ఆలయం వద్ద జరిగిన కార్యక్రమానికి తెలంగాణ యువజన ప్రోటోకాల్ మండలి చైర్మన్ ఆదిత్యరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు వినాయక చవితి సందర్భంగా ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదిత్యరెడ్డి పిలుపునిచ్చారు.మట్టి వినాయక విగ్రహాలను పూజించడం ద్వారా పర్యావరణానికి మేలు జరుగుతుందని తెలిపారు. ప్రకృతి పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. రసాయనాలతో తయారు చేసిన విగ్రహాలకు బదులుగా మట్టి గణపతులను పూజించాలని నిర్వాహకులు కోరారు. ప్రకృతిని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మట్టి వినాయక విగ్రహాలను వినియోగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి కాలనీ వాసులు, స్థానిక ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు..



# సమ్మిళిత వృద్ధి వర్ధిల్లాలి

మొదటి పేజీ తరువాయి...

'మనం వేర్వేరు వాస్తవాల్లో పాతుకుపోయి ఉండవచ్చు, కానీ కలిసికట్టుగా పరస్పర సహకారంతో ఎదిగి, మానవాళి కోసం వికసిస్తాం. మన వైవిధ్యమే గుర్తింపుగా, సహకారమే స్ఫూర్తిగా, మన పురోగతి సకల మానవాళికి సేవగా నిలవాలి' అన్నారు. చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్‌లతో సహా ఈ కూటమిలోని అగ్రనాయ కులసమక్షంలో మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు.

**బ్రిక్స్ దేశాల స్థితిస్థాపకత చాలా కీలకం..**

అస్థిరమైన భౌగోళిక రాజకీయ వాతావరణాన్ని ఎదుర్కోవడానికి బ్రిక్స్ దేశాల స్థితిస్థాపకతను పెంచడం ఎంత ముఖ్యమో ప్రధానమంత్రి స్పష్టం చేశారు. అలాగే, ఈ కూటమికి న్యూఢిల్లీ అధ్యక్షత వహించడం స్థితిస్థాపకత, ఆవిష్కరణ, సహకారంతోపాటు సుస్థిరత అనే నాలుగు స్తంభాలపై దృష్టి సారించిందని తెలిపారు. ఈ నాలుగు స్తంభాల ఆధారంగా, బ్రిక్స్ ద్వారా భారతదేశం సమ్మిళిత ప్రపంచ వృద్ధిని ప్రోత్స హించాలని కోరుకుంటోందన్నారు.

ఎందుకంటే, ఈ కూటమిలో అభివృద్ధి చేసిన పరిష్కారాల ప్రయోజనాలు కేవలం దీనికే పరిమితం కాకూడదన్నారు. వాటిని గ్లోబల్ సౌత్ అవసరాలకు అనుగుణంగా మార్చుకోవాలని, అందరికీ అందుబాటులోకి తీసుకురావాలని భారత దేశం విశ్వసిస్తోందని తెలిపారు. 'మీ అందరి సహకారం, మద్దతుతో మన ఉమ్మడి దార్శనికతను పరస్పర ప్రయోజనకరమైన సహకారంగా మార్చగలిగినందుకు నేను సంతోషిస్తున్నా' అని ఆయన అన్నారు.

నేడు ప్రపంచంలో సంఘర్షణలు, ఉద్రిక్తతల సంఖ్య నిరంతరం పెరుగుతోందని, ఇది సామాన్య ప్రజల జీవితాలపై ప్రతికూల, సుదూర ప్రభావాలను చూపుతోందని చెప్పారు. 'మహమ్మారులు, వాతావరణ విపత్తులు, సరఫరా గొలుసు అంతరాయాలు వంటివి నేటి పరస్పర అనుసంధాన ప్రపంచంలో ఏ సంక్షోభం కూడా ఒకే ప్రాంతానికి పరిమితం కాదని నిరూపించాయి. అందువల్ల, బ్రిక్స్ కూటమిలో భారత్ స్థితిస్థాపకతను బలోపేతం చేయడంపై ప్రత్యేకంగా దృష్టి సారించిందని అన్నారు. సవాళ్ల ను సకాలంలో గుర్తించడం, వాటికి సిద్ధంగా ఉండటం, తక్షణచర్యలు తీసుకోవడం కూడా అంతే ముఖ్యం అని మోదీ వాదించారు.

ఆవిష్కరణల విభాగంలో, బ్రిక్స్ ఇంక్యుబేటర్ నెట్‌వర్క్ మన స్టార్టప్లను, ఇంక్యుబేట ర్లను ఒకదానితో ఒకటి అనుసంధానిస్తుంది. వినూత్న మైన, విస్తరించదగిన పరిష్కారాలను ప్రోత్సహించడానికి బ్రిక్స్ స్టార్టప్ ఇన్నోవేషన్ ఫండ్‌ను భారత్ ప్రతిపాదించిందన్నారు. డిజిటల్ వ్యవ సాయంపై బ్రిక్స్ నెట్‌వర్క్ రైతులకు కొత్త అవకాశాలను సృష్టిస్తుందని, ఎందుకంటే ఈ చొరవ ద్వారా ఏఐ, జియోస్పేషియల్ టెక్నాలజీ, డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్లను రైతుల అవసరాలకు అనుసంధానిస్తారని తెలిపారు.

బ్రిక్స్ దేశాల మధ్య ఉత్తమ పద్ధతులను పంచుకోవడాన్ని సులభతరం చేయడానికి బ్రిక్స్ అర్బన్ మొబిలిటీ హబ్‌ను ఏర్పాటు చేసినట్లు మోదీ చెప్పారు. భారత నాగరికతలో ప్రకృతికి తల్లి హోదా ఇవ్వబడిందని ప్రధాని అన్నారు. శతాబ్దాలుగా, అభివృద్ధి, పర్యావరణం ఒకదానికొకటి ప్రత్యా మ్నాయాలు కాదని, అవి పరస్పర పూరకాలని తాము విశ్వసిస్తున్నామని వెల్లడించారు. 'బ్రిక్స్ కూటమిలో కూడా, మానవ అభివృ ద్ధికి, పర్యావరణానికి మధ్య సమతుల్యత సాధించాల్సిన అవసరాన్ని మోదీ స్పష్టం చేశారు. ఇదే సుస్థిరతకు పునాది. ఇది భవిష్యత్ తరాల పట్ల మన బాధ్యత కూడా అన్నారు.

**మోదీ 15 ద్వైపాక్షిక సమావేశాలు..**

బ్రిక్స్ సదస్సు సందర్భంగా గత మూడు రోజుల్లో ప్రధాని మోదీ వివిధ దేశాల అధ్యక్షులు, ప్రభుత్వ అధినేతలతో 15 ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించారు. ప్రపంచ జనాభాలో 49.5 శాతం, ప్రపంచ జీడీపీలో 40 శాతానికి ప్రాతినిధ్యం వహిస్తున్న 11 ప్రధాన వర్ధమాన ఆర్థిక వ్యవస్థల కూటమి అయిన బ్రిక్స్ వార్షిక శిఖరాగ్ర సమావేశం, లాజిస్టిక్స్ సరఫరా గొలుసులు, స్టార్టప్‌లు, అంటు వ్యాధుల నియంత్రణ వంటి రంగాలలో కీలక ఫలితాలతో ఆదివారం ముగిసింది.

## భక్తిశ్రద్ధలతో శ్రావణ మాస భజన

ప్రజా కలం ప్రతినిధి సెప్టెంబర్ 13 మెదక్ జిల్లా రేగోడు మండల పరిధిలోని ఆర్ ఇటిక్యాల గ్రామంలో శ్రావణమాసం సందర్భంగా 30 రోజులపాటు హనుమాన్ మందిరం వద్ద గ్రామ ప్రజలు భక్తిశ్రద్ధలతో భజన కార్యక్రమం చేసి అమావాస్య ముగింపు సందర్భంగా ఆంజనేయ స్వామికి చందనం నైవేద్యం సమర్పించి భక్తులకు అన్న ప్రసాదాలు అందజేశారు ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు ఉన్నారు




## ఉప్పల్ బాగాయత్‌లో ఆర్యవైశ్య భవన్‌కు భూమిపూజ

### గజ్వేల్ నుంచి తరలివెళ్లిన ఆర్యవైశ్య నాయకులు

గజ్వేల్:13 సెప్టెంబర్ 2026 (ప్రజా కలం ప్రతినిధి)

హైదరాబాద్‌లోని ఉప్పల్ బాగాయత్‌లో ఆర్యవైశ్య భవన్ నిర్మాణానికి నిర్వహించిన భూమిపూజ కార్యక్రమానికి గజ్వేల్-ప్రజ్ఞాపూర్‌కు చెందిన ఆర్యవైశ్య నాయకులు, ప్రతినిధులు ఆదివారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ రాజకీయ కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షులు,నాచారం దేవస్థానం డైరెక్టర్ జగ్గయ్యగారి శేఖర్ మాట్లాడుతూ ఉప్పల్ బాగాయత్‌లో ఆర్యవైశ్య భవన్



నిర్మాణానికి భూమిపూజ జరగడం సంతోషంగా ఉందన్నారు. భవన్ నిర్మాణానికి సహకరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆర్యవైశ్యుల సంక్షేమానికి భవన్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర యువజన ఉపాధ్యక్షులు సిద్ధి నవీన్, పట్టణ అధ్యక్షులు అత్తెల్లి శ్రీనివాస్ తదితరులు భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇటిక్యాల మాజీ సర్పంచ్ రావికంటి చంద్రశేఖర్ మాట్లాడుతూ ఆర్యవైశ్యుల ఐక్యతతోనే ఎన్నో కార్యక్రమాలను విజయవంతంగా చేపట్టవచ్చన్నారు. గత ప్రభుత్వం ఆర్యవైశ్యులకు ఉప్పల్ బాగాయత్‌లో కేటాయించిన స్థలంలో భవన్ నిర్మాణానికి భూమిపూజ జరగడం ఆనందంగా ఉందన్నారు. త్వరితగతిన భవన్ నిర్మాణం పూర్తికావాలని వాసవి మాతను ప్రార్థించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ మహంకాళి శ్రీనివాస్,వాసవి క్లబ్ అధ్యక్షులు గంగిశెట్టి వెంకటేశం,ఉమేష్, ఉప్పల కృష్ణమూర్తి, కాశీనాథ్,సిద్ధి రామచంద్రం,రామారావు రమేష్,సిరిపురం సత్యనారాయణ, ఉప్పల చంద్రశేఖర్,గందే సంతోష్ తదితరులు పాల్గొన్నారు.




## నవధాన్యాల గణపతి రామకోటి రామరాజు వినూత్న ఆలోచన

### భక్తికి సృజనాత్మకత జోడించి నవధాన్యాలతో గణపయ్య

### 30ఏళ్ల నుండి ఎన్నో చిత్రాలను చిత్రించిన రామకోటి సంస్థ



గజ్వేల్:13 సెప్టెంబర్ 2026 ( ప్రజా కలం ప్రతినిధి)

వినాయక చవితి సందర్భంగా నవధాన్యాలను కళాత్మకంగా ఉపయోగించి, భక్తి, సృజనాత్మకతను మేళవిస్తూ అద్భుతమైన వినాయక చిత్రాన్ని రూపొందించి అందరినీ ఆకట్టుకున్నారు సిద్దిపేట జిల్లా గజ్వేల్‌కు చెందిన శ్రీరామకోటి భక్త సమాజం వ్యవస్థాపక, అధ్యక్షులు, భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత రామకోటి రామరాజు. వివిధ రంగులు, ఆకృతులతో అలరించే వినాయక చిత్రాలకు భిన్నంగా మన సాంప్రదాయానికి ప్రతీకలైన నవధాన్యాలతో విఘ్నేశ్వరుడి రూపాన్ని తీర్చిదిద్దడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా రామకోటి రామరాజు మాట్లాడుతూ గత 30 సంవత్స రాలుగా వివిధ రకాల భగవంతుని చిత్రాలను వినూత్న పద్ధతుల్లో రూపొందిస్తూ ప్రజల్లో ఆధ్యాత్మిక చైతన్యాన్ని కలిగించే సందేశాలను అందిస్తున్నానన్నారు. సకల విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడి చిత్రాన్ని మూడు రోజులపాటు ఎంతో శ్రమించి, భక్తిశ్రద్ధలతో నవధాన్యాలతో రూపొందించానని తెలిపారు. ప్రతి సంవత్సరం కొత్త ఆలోచనతో,కొత్త తరహాలో భగవంతుని చిత్రాలను రూపొందించి తద్వారా ఆధ్యాత్మిక సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తున్నానని రామకోటి రామరాజు పేర్కొన్నారు.

## 12 ఏళ్లుగా ఎదురుచూపులేనా?

- తెలంగాణ కోసం పాడిన గొంతులకు.. ఉద్యోగాలెక్కడ?
- ఉద్యమంలో ముందు వరుస.. ఉపాధిలో చివరి వరుస
- హామీలతో కాలయాపన వద్దు.. తక్షణమే నిర్ణయం తీసుకోవాలి
- ఉద్యమ కళాకారులపై ప్రభుత్వం వివక్ష మానుకోవాలి
- తెలంగాణ సాంస్కృతిక సారథిలో తక్షణమే అవకాశం కల్పించాలి: ఎర్రవల్లి శ్రీనివాస్



**సిద్దిపేట, సెప్టెంబర్ 13 (ప్రజా కలం ప్రతినిధి):**

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో తమ కళను ఆయుధంగా, పాటను పోరాటంగా మలిచి ప్రజలను చైతన్య పరిచిన ఉద్యమ కళాకారులకు రాష్ట్రం ఏర్పడి పన్నెండున్నరేళ్లు గడిచినా ఉపాధి భరోసా కల్పించకపోవడం బాధాకరమని సిద్దిపేట జిల్లా నిరుద్యోగ కళాకారుల సంఘం అధ్యక్షుడు ఎర్రవల్లి శ్రీనివాస్ అన్నారు.ఆదివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల నుంచి పట్టణాల వరకు,గల్లీ నుంచి ఢిల్లీ వరకు రాస్తారోకోలు,వంటావార్పులు, సకల జనుల సమ్మె, బహిరంగ సభల్లో పాటలు,డప్పులు,ధూంధాం ప్రదర్శనల ద్వారా తెలంగాణ ఆకాంక్షను ప్రజల్లోకి తీసుకెళ్లిన కళాకారులు నేడు ఉపాధి కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.

**మాటలు కాదు.. కార్యాచరణ కావాలి**

ఉద్యమ కళాకారుల సమస్యలను శాసనమండలిలో ప్రస్తావించిన ఎమ్మెల్సీ విజయశాంతికి,అలాగే సమస్యను ప్రస్తావిస్తున్న పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు సంఘం తరపున కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాప్రతినిధులు సమస్యను ప్రస్తావించడం ఆశ కలిగిస్తున్నప్పటికీ,అది మాటలకే పరిమితం కాకుండా ప్రభుత్వం కార్యాచరణకు దిగాలని కోరారు.కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఉద్యోగాల కల్పనపై ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఉద్యమ కళాకారుల విషయంలో స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు."తెలంగాణ కోసం మా పాటలు, మా కళ అవసరమైనప్పుడు గుర్తించారు.రాష్ట్రం ఏర్పడిన తర్వాత మా జీవితాలు ఎందుకు గుర్తుకు రావడం లేదు?" అని ఉద్యమ కళాకారులు ప్రశ్నిస్తున్నారని శ్రీనివాస్ పేర్కొన్నారు.సాంస్కృతిక సారథిలో అవకాశం కల్పించాలి.ఉద్యమ కళాకారులకు కేవలం ప్రశంసలు, సన్మానాలు,హామీలు సరిపోవని అన్నారు. ఉద్యమంలో వారు చేసిన సేవలు,అర్హత,అనుభవం, పాత్రను పరిగణనలోకి తీసుకుని తెలంగాణ సాంస్కృతిక సారథిలో ప్రత్యేకంగా ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

**మంత్రి జూపల్లి చొరవ చూపాలి**

సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఉద్యమ కళాకారుల సమస్యపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దృష్టికి సమస్యను బలంగా తీసుకెళ్లి తక్షణ నిర్ణయం వచ్చేలా చొరవ చూపాలని కోరారు."మంత్రి జూపల్లి కృష్ణారావు ఒక అడుగు ముందుకు వేస్తే ఉద్యమ కళాకారుల జీవితాల్లో వెలుగు నింపే అవకాశం ఉంది" అని పేర్కొన్నారు.

**ఇక హామీలు కాదు.. ఉద్యోగాలే కావాలి**

కాలయాపనకు కూడా ఒక హద్దు ఉంటుందని, ఉద్యమ కళాకారుల సహనానికి పరిమితి ఉందని శ్రీనివాస్ అన్నారు.ఇకపై హామీలతో కాలయాపన చేయకుండా స్పష్టమైన కార్యాచరణ ప్రకటించి ఉద్యోగాల భర్తీ ప్రక్రియను ప్రారంభించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.తెలంగాణ కోసం పాడిన గొంతులకు తెలంగాణలోనే ఉద్యోగం, తెలంగాణ కోసం మోగిన డప్పులకు గౌరవం, ఉద్యమంలో పాల్గొన్న కళాకారులకు గౌరవప్రదమైన జీవితం కల్పించాలని కోరారు.కార్యక్రమంలో నిరుద్యోగ కళాకారుల రాష్ట్ర కార్యదర్శి పిన్నింటి దాసు,జిల్లా ఉపాధ్యక్షుడు తునికి రాజు తదితరులు పాల్గొన్నారు.

# విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రజల జీవితాల్లో మరిన్ని వెలుగులు నిండాలి

## - ప్రజలకు రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వినాయక చవితి శుభాకాంక్షలు.

పాలేరు సెప్టెంబర్ 13(ప్రజా కలం న్యూస్ )



వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి రాష్ట్ర ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నాలను తొలగించి, విజయాలను అందించే విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు, శాంతి, సౌభాగ్యం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ప్రజలంతా భక్తిశ్రద్ధలతో వినాయక చవితిని జరుపుకోవాలని, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించాలని మంత్రి సూచించారు. గణనాథుడి ఆశీస్సులతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు.

# నిర్మల్ జిల్లా ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలుపిన జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల.

నిర్మల్ సెప్టెంబర్ 12(ప్రజా కలం జిల్లా ప్రతినిధి)



వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని నిర్మల్ జిల్లా ప్రజలందరికీ జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి, సౌభాగ్యం నెలకొనాలని ఆకాంక్షించారు. వినాయక చవితి ఉత్సవాలను ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో, శాంతియుత వాతావరణంలో సోదరభావంతో జరుపుకోవాలని ఎస్పీ సూచించారు. ఉత్సవ కమిటీలు, భక్తులు పోలీసు శాఖ సూచనలు, నిబంధనలు పాటిస్తూ సహకరించాలని కోరారు.

విగ్రహాల ప్రతిష్ఠాపన నుంచి నిమజ్జనం వరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. యువత క్రమశిక్షణతో వ్యవహరిస్తూ ఇతరులకు ఇబ్బందులు కలగకుండా ఉత్సవాలను నిర్వహించాలని సూచించారు. ప్రజల శాంతి, భద్రతల పరిరక్షణకు నిర్మల్ పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, తెలిపారు.

# ఏఐపిసి బలోపేతమే లక్ష్యంగా పనిచేస్తా

## -జిల్లా అధ్యక్షుడు కమ్మగోని చౌదరి గౌడ్

## -ఏఐపిసి జాతీయ చైర్మన్ మధు యాష్కీ గౌడ్‌తో భేటీ



**పెద్దపల్లి,సెప్టెంబర్ 13: (ప్రజాకలం జిల్లా ప్రతినిధి)**


ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కమ్మగోని చౌదరి గౌడ్ హైదరాబాద్‌లో ఏఐపిసి జాతీయ చైర్మన్ మధు యాష్కీ గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు ఆత్మీయ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వీరిద్దరూ పెద్దపల్లి జిల్లాలో ఏఐపిసి సంస్థాగత పురోగతి, చేపట్టాల్సిన భవిష్యత్ కార్యక్రమాలు మరియు పార్టీ బలోపేతానికి సంబంధించిన పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా కమ్మగోని చౌదరి గౌడ్ మాట్లాడుతూ జాతీయ చైర్మన్ మధు యాష్కీ గౌడ్ సమర్థవంతమైన దూరదృష్టి,నాయకత్వ మార్గదర్శకత్వంలో జిల్లా వ్యాప్తంగా ఏఐపిసిని మరింత విస్తరిస్తామని తెలిపారు. గ్రామ, మండల,నియోజకవర్గ స్థాయిలో సంస్థను బలోపేతం చేసేందుకు పూర్తి అంకితభావంతో పనిచేస్తానని పేర్కొన్నారు. వివిధ రంగాల వృత్తినిపుణులను,మేధావులను ప్రజాసేవ వైపు మళ్లించడమే కాకుండా,స్థానిక ప్రజా సమస్యల పరిష్కారానికి వినూత్నమైన కార్యక్రమాలు చేపడతామని ఆయన స్పష్టం చేశారు. మధు యాష్కీ గౌడ్ దిశానిర్దేశంలో ఏఐపిసి దేశవ్యాప్తంగా ప్రజలు, వృత్తినిపుణుల్లో మరింత విశ్వసనీయతను పొందుతూ,సంస్థాగతంగా కొత్త శిఖరాలను అధిరోహిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# వినాయక ఉత్సవాలకు భక్తిశ్రద్ధల పిలుపు..

## - ఐకమత్యంగా ఉత్సవాలు.. ప్రజల అవసరాలకు సహకారం - గూడెం మహిపాల్ రెడ్డి పిలుపు..

పటాన్‌చెరు, సెప్టెంబర్ 13(ప్రజా కలం) ప్రతినిధి

వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను ప్రజలంతా భక్తిశ్రద్ధలతో,ఆనందోత్సవాల మధ్య ప్రశాంత వాతావరణంలో ఐకమత్యంగా నిర్వహించుకోవాలని పటాన్‌చెరు శాసనసభ్యుడు గూడెం మహిపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. బీరంగూడ డివిజన్ పరిధిలోని సాయికృపా కాలనీ,సాయి భగవాన్ కాలనీల్లో నూతనంగా నిర్మించిన వినాయక మండపాలను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ,కాలనీల్లో ఆధ్యాత్మిక,సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజలంతా కలిసిమెలిసి పండుగను జరుపుకోవాలని సూచించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి కార్యక్రమాలకు తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు



తెలిపారు. కార్యక్రమంలో అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, మాజీ ప్రజాప్రతినిధులు మల్లేష్, బాలరాజు, కృష్ణ, జగదీష్, ఆయా కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు, స్థానిక నాయకులు, భక్తులు, కాలనీ వాసులు పాల్గొన్నారు..

# తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి

## గ్రామ గ్రామాన ఉత్సవాలు జరుపుకోవాలి

## ప్రెస్ మీట్ లో ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్

నిర్మల్ సెప్టెంబర్ 13 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా చేపట్టాలని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ డిమాండ్ చేశారు. ఆదివారం బైంసాలోని




ఎమ్మెల్యే నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. స్వాతంత్రం వచ్చిన సంవత్సరం తర్వాతనిజాం పాలన నుండి విముక్తి లభించిందని,, ప్రభుత్వం అధికారికంగా ఉత్సవాలు నిర్వహించకపోవడం సరియైనది కాదన్నారు. సెప్టెంబర్ 17న అన్ని జిల్లా కేంద్రాల్లో ఉత్సవాలు నిర్వహించాలని, సర్దార్ వల్లభాయ్ పటేల్ ను స్మరించు కోవాల్సిన అవసరం ఉందన్నారు. హైదరాబాద్ లో సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ విమోచనం పట్ల చిత్త శుద్ధిలేదన్నారు. 17వ తేదీన బిజెపి ఆధ్వర్యంలో గ్రామ గ్రామాన జాతీయ జెండాలు ఎగరవేస్తామన్నారు. మహారాష్ట్ర కర్ణాటక ప్రభుత్వాలు విమోచన దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్నప్పటికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక వర్గం మెప్పుకోసం అధికారికంగా చేపట్టకపోవడం శోచనీయమన్నారు. సమావేశంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నా రెడ్డి, సీనియర్ నాయకులు సాంప్లీ రమేష్, బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు రమేష్, బైంసా మండల బిజెపి అధ్యక్షురాలు దేగాం సర్పంచ్ సిరం సుష్మరెడ్డి తదితరులున్నారు.

# జిల్లా ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు

## జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్ సెప్టెంబర్ 13 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లా ప్రజలకు జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నేశ్వరుని కృపతో ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, సౌభాగ్యం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. వినాయక ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, పరస్పర సహకారం, ఐకమత్యంతో ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని కలెక్టర్ కోరారు. ఉత్సవాల సందర్భంగా ప్రజలు, నిర్వాహకులు ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి, పర్యావరణహిత నిమజ్జనానికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. విద్యుత్, అగ్నిప్రమాదాలు, ఇతర అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నిమజ్జన కార్యక్రమాలను అధికారుల సూచనల మేరకు నిర్దేశిత ప్రదేశాల్లోనే సురక్షితంగా నిర్వహించాలని, ప్రజలు సంయమనం పాటిస్తూ ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కోరారు.



# ఆధారాలు లేకుండా ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదు

## - పేద కార్మికులను నమ్మించి రూ.10 కోట్లు మోసగించారు
## - ఉద్యోగాల స్కామ్‌తో నాకు సంబంధం లేదు
## -బాధితులకు నా సొంత డబ్బులు ఇచ్చా
## -మహనీయుల ఆశయ సాధన సంఘం అధ్యక్షుడు బొంకూరి కైలాసం



**పెద్దపల్లి:సెప్టెంబర్ 13: (ప్రజాకలం జిల్లాప్రతినిధి)**

తనపై కొందరు వ్యక్తిగత ద్వేషంతో కావాలని అసత్య ప్రచారం చేస్తున్నారని,ఆధారాలు లేని ఆరోపణలు గుప్పిస్తే చట్టపరంగా కోర్టు నోటీసులు పంపిస్తామని మహనీయుల ఆశయ సాధన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు బొంకూరి కైలాసం తీవ్రంగా హెచ్చరించారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘ అధ్యక్షుడు బొంకురి కైలాసం మాట్లాడుతూ ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం నాయకులు మామిడిపల్లి బాపయ్య, లంక సదయ్య,బొంకూరి మధు వ్యవహార శైలి,వారి ఏకపక్ష తీరు సరిగా లేకపోవడం వల్లే తాను ఆ సంఘం నుండి బయటకు రావాల్సి వచ్చిందన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా, నిజాయితీగా పని చేసేందుకు జిల్లా స్థాయిలో మహనీయుల ఆశయ సాధన సంఘాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్నట్లు స్పష్టం చేశారు. తాను సెప్టెంబర్ 4న పెద్దపల్లి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం గురించిన వ్యాఖ్యల్లో ఏవైనా పొరపాట్లు దొర్లి ఉంటే వాటిని ఉపసంహరించుకుంటున్నానని,ఎవరి మనోభావాలైనా దెబ్బతిని ఉంటే క్షమించాలని ఈ సందర్భంగా కోరారు. అదే సమయంలో తనపై పెట్టిన కేసులు,నమోదైన ఎఫ్ఐఆర్ లకు భయపడే ప్రసక్తే లేదని,పోలీసు వ్యవస్థ మరియు దేశ చట్టాలపై తనకు సంపూర్ణ నమ్మకం ఉందన్నారు. గుండారం ప్రాంతంలో ఉద్యోగాల పేరిట తాను స్కామ్ చేశాననడం పూర్తిగా అవాస్తవమని కొట్టిపారేశారు. సుల్తానాబాద్‌కు చెందిన చిలక రాజేశం అనే వ్యక్తి బాధితుల వద్ద డబ్బులు వసూలు చేయగా,తలెత్తిన వివాదంలో కమాన్ పూర్ ఎస్.ఐ సూచన మేరకు తాను మధ్యవర్తిగా ఉండి బాధితులకు న్యాయం చేసేందుకు తన సొంత డబ్బులు 90వేలు చెల్లించినట్లు వివరించారు.

ఇదే క్రమంలో గోదావరిఖని ప్రాంతంలో పారిశుద్ధ్య,రిక్షా కార్మికులకు పర్మినెంట్ ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మబలికి,ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి మధు,మరికొందరు ముఠాగా ఏర్పడి దాదాపు 10 కోట్ల వరకు వసూలు చేసి పేద కార్మికులను దారుణంగా మోసం చేశారని తీవ్రమైన ప్రత్యారోపణలు చేశారు. వారి అక్రమ బండారాన్ని ఆధారాలతో సహా త్వరలోనే బయటపెడతానని తెలిపారు. తనపై ఆరోపణలు చేస్తున్న వారికి ధైర్యముంటే ఆధారాలను పోలీసులకు అప్పగించి జైలుకు పంపాలని,అలా కాకుండా పత్రికా సమావేశాల్లో కించపరిచేలా మాట్లాడితే న్యాయస్థానాన్ని ఆశ్రయించి చట్టపరమైన చర్యలు తీసుకుంటానని తేల్చిచెప్పారు. తనపై ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం నాయకులు భౌతిక దాడులకు ప్రయత్నిస్తున్నారని, తనకు ఎలాంటి ప్రాణహాని లేదా నష్టం వాటిల్లినా దానికి పూర్తి బాధ్యత మామిడిపల్లి బాపయ్య,బొంకూరి మధు,లంక సదయ్య లదేనని బొంకూరి కైలాసం సంచలన వ్యాఖ్యలు చేశారు.

# కోలూర్ తండాలో ఘనంగా 'తీజ్' వేడుకలు

## : బంజారా సంస్కృతికి అద్దంపట్టిన సంబరాలు!

తానూర్,సెప్టెంబర్ 13(ప్రజా కలం): మండలంలోని కోలూర్ తండాలో ఆదివారం బంజారా సంస్కృతి, సంప్రదాయాల పరిమళాలతో శోభిల్లింది. గిరిజనులు అత్యంత పవిత్రంగా భావించే 'తీజ్' ఉత్సవాలను గ్రామంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యువతులు ఎంతో భక్తిశ్రద్ధలతో సిద్ధం చేసిన తీజ్ (గోధుమ మొలకల బుట్టల)కు ప్రత్యేక పూజలు చేసి, గ్రామంలోని శ్రీ జగదాంబ ఆలయానికి ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి ప్రత్యేక నైవేద్యాలు సమర్పించారు, సంప్రదాయ దుస్తులు ధరించిన బంజారా యువతుల నృత్య ప్రదర్శనలు, జానపద గీతాలు ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచి పండుగ శోభను రెట్టింపు చేశాయి. ఈ కార్యక్రమంలో తండా కారోబారి జాదవ్ రవీ, నాయక్ వికాస్ పవార్, డావ్ రంగారావు రాథోడ్, శానో ఉత్తం , సర్పంచ్ నిర్మలా బాయి – గణేష్ పవార్ ,ఉపసర్పంచ్, గ్రామ పెద్దలతో పాటు మహిళలు, యువతీ యువకులు పాల్గొన్నారు.



# ప్రజా ఉద్యమ నాయకుడికి గౌరవం

## -టీపీసీసీ నాయకులు పెర్క శ్యామ్
## -ఇంజం వెంకటస్వామికి ఘన సన్మానం



**పెద్దపల్లి:సెప్టెంబర్ 13:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)**

మహాజన సోషలిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా నూతనంగా నియమితులైన ఇంజం వెంకటస్వామిని ఆదివారం పెద్దపల్లి లో టీపీసీసీ నాయకులు పెర్క శ్యామ్ శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పెర్క శ్యామ్ మాట్లాడుతూ మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో సామాజిక న్యాయం,ప్రజా హక్కులు,ఎస్సీ వర్గీకరణ ఉద్యమాలతో పాటు అనేక ప్రజా సమస్యల పరిష్కారం కోసం వెంకటస్వామి దశాబ్దాలుగా అంకితభావంతో పనిచేశారని కొనియాడారు. గ్రామస్థాయి నుంచి అంచెలంచెలుగా ఎదుగుతూ మండల,జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి నేడు ఎంఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులు కావడం ఆయన కృషికి దక్కిన తగిన గుర్తింపు అని అన్నారు. పదవి అనేది హోదా కాదని, ప్రజల పట్ల బాధ్యతను పెంచే అవకాశమని పేర్కొంటూ,కొత్త బాధ్యతలతో రాష్ట్రవ్యాప్తంగా పార్టీని బలోపేతం చేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్పీఎస్ నాయకులు అంబాల రాజేందర్ తదితరులు పాల్గొని నూతన అధ్యక్షుడికి శుభాకాంక్షలు తెలిపారు.

# కోరుట్లకు 3 వేల కుట్టుమిషన్లు విడుదల చేయాలి

## బీసీ మహిళలకు ప్రాధాన్యత ఇవ్వాలి

## బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఒజ్జెల శ్రీనివాస్

మెట్ పల్లి టౌన్ ప్రతినిధి, సెప్టెంబర్ 13 (ప్రజాకలం): కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లు అందిస్తామని ప్రకటించి, ఇందుకు



సంబంధించిన దరఖాస్తు ప్రక్రియను ఆన్‌లైన్ ద్వారా కొనసాగిస్తున్న నేపథ్యంలో కోరుట్ల నియోజకవర్గానికి కనీసం 3 వేల కుట్టుమిషన్లు విడుదల చేయాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఒజ్జెల శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు.
ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కోరుట్ల నియోజకవర్గంలో కుట్టుపనిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వారు అధిక సంఖ్యలో ఉన్నారని తెలిపారు. ముఖ్యంగా మేర, పద్మశాలి కులాలతో పాటు ఇతర బీసీ వర్గాలకు చెందిన అనేక కుటుంబాలకు కుట్టుపని ప్రధాన జీవనాధారంగా ఉందన్నారు.నియోజకవర్గంలో బీసీ జనాభా అధికంగా ఉన్నందున ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి, అర్హులైన బీసీ మహిళలకు ప్రయోజనం చేకూరేలా కనీసం 3 వేల కుట్టుమిషన్లు కేటాయించాలని ఒజ్జెల శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో శివ చరణ్, గడిపెల్లి రాజు, గంగాధర్, స్వరాజ్, మహేశ్, బాలకంఠం సాయి తదితరులు పాల్గొన్నారు.

# ఎరువుల యాప్‌తో రైతన్నల సతమతం..

మల్లాపూర్, సెప్టెంబర్ 13 (ప్రజా కలం ప్రతినిధి):
కేంద్ర ప్రభుత్వం ఎరువుల పంపిణీ కోసం ప్రవేశపెట్టిన ఎరువుల విక్రయ యాప్‌తో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రైతు వేదిక



సంయుక్త కార్యదర్శి బద్దం రాజేష్ రెడ్డి అన్నారు. యాప్‌లో తరచూ సాంకేతిక సమస్యలు, ఇతర లోపాలు తలెత్తడంతో ఎరువులు పొందేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఒకవైపు తెలంగాణలో వర్షాల ప్రభావంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటుండగా, మరోవైపు ఎరువుల కోసం ఎదురవుతున్న సమస్యలు వారిని మరింత ఇబ్బందులకు గురిచేస్తున్నాయని పేర్కొన్నారు. గతంలో అందుబాటులో ఉన్న యాప్ సులభంగా ఉండేదని, ప్రస్తుతం ఉన్న విధానంలో తరచూ సాంకేతిక సమస్యలు వస్తున్నాయని అన్నారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ప్రస్తుత యాప్ విధానాన్ని రద్దు చేసి పట్టా పుస్తకం ఆధారంగా ఎరువులు పంపిణీ చేసే విధానాన్ని అమలు చేయాలని బద్దం రాజేష్ రెడ్డి డిమాండ్ చేశారు.

# కరెంట్ కోతల పై రైతుల ధర్నా..

మల్లాపూర్, సెప్టెంబర్ 13 (ప్రజా కలం ప్రతినిధి):
విద్యుత్ కోతలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆరోపిస్తూ మల్లాపూర్ మండల రైతులు ఆదివారం సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా చేపట్టారు.



వ్యవసాయానికి అవసరమైన సమయంలో విద్యుత్ సరఫరా లేక పంటలకు నీరందించలేక ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు ఆశించిన స్థాయిలో వర్షాలు లేకపోవడం, మరోవైపు తరచూ విద్యుత్ కోతలు విధించడంతో వ్యవసాయం భారంగా మారిందని పేర్కొన్నారు. విద్యుత్ ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొందని అన్నారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని నాణ్యమైన 24 గంటల విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

# డాన్స్ పోటీల్లో సత్తా చాటిన శివాంషి

పెద్దపల్లి:సెప్టెంబర్ 13:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)
కమాన్‌పూర్ మండల కేంద్రానికి చెందిన తలారి శివాంషి నృత్య పోటీల్లో తన ప్రతిభను చాటి ఉత్తమ డ్యాన్సర్ అవార్డును సొంతం చేసుకుంది.పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ఇటీవల నిర్వహించిన కళాకృతి వేదిక-2026 సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా జానపద,సినీ, కూచిపూడి నృత్య పోటీలు నిర్వహించారు.ఈ పోటీల్లో శివాంషి తన అద్భుత నృత్య ప్రదర్శనతో అందరినీ ఆకట్టుకుని బెస్ట్ డాన్సర్ గా ఎంపికైంది.ప్రముఖ డ్యాన్స్ మాస్టర్ వద్ద శిక్షణ పొందుతున్న శివాంషి,గతాన్ని బట్టి చూస్తే ఇప్పటికే పలు వేదికలపై ఎన్నో అవార్డులు సాధించి ప్రశంసలు అందుకుంది.ప్రోగ్రామ్ ఆర్గనైజర్ శ్రీదేవి,డ్యాన్స్ మాస్టర్ పులిపాక దేవా,మ్యాజిక్ శశి,వీరుల ప్రశాంత్ తదితరులు పాల్గొని విజేతకు అవార్డును అందజేశారు.చిన్న వయసులోనే నృత్య రంగంలో ప్రతిభ చూపుతున్న శివాంషిని పలువురు ప్రముఖులు,గ్రామస్థులు అభినందించారు.భవిష్యత్తులో ఆమె మరిన్ని పురస్కారాలు అందుకోవాలని,ఈ రంగంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.





# జ్ఞాపకాలకు వర్ణాలు...అక్షరాల అంగడికి ప్రాణం

## -ఊషన్నపల్లి బడి గోడలపై రంగుల విజ్ఞాన జగత్తు

## -రూ. 21 వేలతో విశ్రాంత ఉపాధ్యాయురాలు స్వర్ణలత ఔదార్యం






పెద్దపల్లి:సెప్టెంబర్13:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)
పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలం ఊషన్నపల్లి ప్రభుత్వ ఆంగ్ల మాధ్యమ ప్రాథమిక పాఠశాలలో విద్యా వికాసానికి దాతల సహకారం కొత్త ఉత్తేజాన్ని నింపింది.పాఠశాలలోని నూతన భవన వరండా గోడలను విద్యార్థులకు నిత్య అభ్యసన దీపాలుగా మలిచేందుకు అదే పాఠశాలలో పనిచేసి ప్రస్తుతం సుల్తానాబాద్‌లో నివాసముంటున్న విశ్రాంత ఉపాధ్యాయురాలు ఈజే స్వర్ణలత ముందుకొచ్చారు.తన దివంగత కుమార్తె కీర్తిశేషులు మాధన శాంతి ప్రియ జ్ఞాపకార్థం రూ. 21వేల స్వంత నిధులతో వరండా గోడలపై పదాలు నేర్చుకుందాం వర్డ్ వాల్ విభాగా లుగా రంగురంగుల బొమ్మలు, తెలుగు మరియు ఇంగ్లీష్ అక్షరాలు, కళ్లకు కట్టే వర్ణచిత్రాలను రాయించారు.పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఈర్ల సమ్మయ్య అభ్యర్థనను స్వీకరించి,ఎంతో దూరంలో ఉన్నప్పటికీ విద్యాబోధనకు ఉపకరించేలా ఈ పెయింటింగ్స్ వేయించి తన ఉదారతను చాటుకున్నారు.గోడలపై వేయించిన ఈ ఆకర్షణీయమైన అక్షరాలు, బొమ్మలను చూస్తూ పిల్లలు ఉత్సాహంగా, స్వయంగా చదువుకుంటూ తమ పదజాలాన్ని పెంపొందించుకుంటుండటంతో పాఠశాలను పిల్లల స్వయం అభ్యసన కేంద్రంగా తీర్చిదిద్దినట్లు హెచ్ఎం తెలిపారు. పాఠశాల అభివృద్ధికి నిస్వార్థంగా సహకరించిన స్వర్ణలతకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఇదే తరహాలో పాఠశాలలోని మిగతా మూడు తరగతి గదులకు కూడా పెయింటింగ్స్ వేయించాల్సిన అవసరం ఉందని,స్థానిక దాతలు,ప్రజాప్రతినిధులు స్పందించి సహాయ సహకారాలు అందిస్తే ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేసి విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయవచ్చని ఈ సందర్భంగా హెచ్ఎం ఈర్ల సమ్మయ్య విజ్ఞప్తి చేశారు.

# పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతులనే పూజిద్దాం

## -ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే విజయరమణారావు

## -ఉచిత మట్టి వినాయక విగ్రహాల పంపిణీ



పెద్దపల్లి:సెప్టెంబర్13:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులై,రసాయన విగ్రహాలకు బదులుగా మట్టి వినాయక విగ్రహాలనే పూజించాలని ప్రభుత్వ విప్,పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు పిలుపునిచ్చారు.
వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణ కేంద్రంలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నియోజకవర్గ ప్రజలకు మట్టి వినాయకుడి విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించగా,పలువురు ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే విజయరమణ రావు ప్రజలకు ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలను అందజేశారు.అనంతరం నియోజకవర్గ ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయనాలు,ప్లాస్టర్ ఆఫ్ పారిస్ తో తయారు చేసిన విగ్రహాల వల్ల నీరు, పర్యావరణం కలుషితమవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు.ప్రకృతిని రక్షించుకోవడం మనందరి బాధ్యత అని,మట్టి విగ్రహాల వాడకాన్ని ప్రోత్సహిస్తూ ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకే ఈ ఉచిత పంపిణీ కార్యక్రమం చేపట్టామని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్ నుగుల్ల మల్లయ్య,స్థానిక కౌన్సిలర్లు,మున్సిపల్ కమిషనర్,కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు,ప్రజలు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మట్టి గణపతులనే పూజించాలి: సిఐ బాలరాజు




ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) మట్టి గణపతిని పూజించి పర్యావరణాన్ని పరిరక్షించాలని సూరారం సీఐ బాలరాజు, శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు గోగులపాటి కృష్ణమోహన్ ప్రజలకు పిలుపునిచ్చారు. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి మేడ్చల్ శాఖసైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ – కొంపల్లి వారి సౌజన్యంతో శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సూరారం కాలనీలో భక్తులకు ఉచిత మట్టి గణపతుల వితరణ కార్యక్రమం చేపట్టారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సూరారం సీఐ బాలరాజు చేతుల మీదుగా భక్తులకు మట్టి విగ్రహాలను అందజేశారు. ఈసందర్భంగా సీఐ బాలరాజు మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మట్టి గణపతులనే ప్రతిష్ఠించి పూజించుకోవాలని, పండుగను శాంతి సామరస్యాలతో, భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని సూచించారు. సమాజ హితం కోసం శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం చేపడుతున్న సేవా కార్యక్రమాలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం సంఘ అధ్యక్షుడు గోగులపాటి కృష్ణమోహన్ మాట్లాడుతూ.. ఇప్పటికే చెరువులు, కుంటలు కాలుష్యంతో కలుషితమైపోతున్నాయని, వీటికి తోడు ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్, రసాయనాలతో చేసిన విగ్రహాలను నిమజ్జనం చేయడం వలన జలాలు మరింత విషతుల్యమయ్యే ప్రమాదం ఉందని, అందుకే ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి సహకారంతో గత కొన్నేళ్లుగా తమ సంఘం ఆధ్వర్యంలో ఉచితంగా మట్టి గణపతులను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. గణేష్ నవరాత్రులు వినోదం కోసం కాకుండా భక్తి ప్రవృత్తులతో జరుపుకోవాలని ఆయన సూచించారు.
ఇందులో భాగంగా సూరారం కాలనీలోని వాసుదేవ ఆశ్రమంలో శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం మహిళా సభ్యురాలు గీతా
ఈకార్యక్రమంలో శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం ప్రధాన సలహాదారు సర్వేపల్లి రమేష్, సంఘ సభ్యులు గడ్డం రాంబాబు, హరి రాఘవేంద్ర, కనపర్తి సాయిరామ్, గడ్డం గోవర్ధన్ రావు, రామకృష్ణ శర్మ, రాచపూడి ప్రభాకర్, కోడూరి జగదీష్, సుబ్బలక్ష్మి సంజీవరావు, దివాకర్, చందు, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి సిబ్బంది రాకేష్, జే.ఎస్.ఆర్ అసోసియేషన్ గ్రూప్ సభ్యులు కిరణ్ సాయి, విశాల్ కుమార్ పాల్గొన్నారు.





# ఘనంగా ఉమెన్స్ సండే వేడుకలు

జగిత్యాల ప్రతినిధి సెప్టెంబర్ 13(ప్రజా కలం):
జగిత్యాల పట్టణంలోని సీఎస్ఐ వెస్లీ చర్చిలో ఆదివారం ఉమెన్స్ సండే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జగిత్యాల ఫాస్టర్ చైర్మన్ జాకోబ్ లక్ష్మణ్ సతీమణి సంపూర్ణ జాకోబ్ ప్రత్యేక దైవ సందేశాన్ని అందించారు. దేవునిపై విశ్వాసం, దైవిక జీవితంలో మహిళల ప్రాధాన్యతను వివరించారు. మహిళలు ఆధ్యాత్మికంగా, సామాజికంగా మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. అనంతరం ఇటీవల నిర్వహించిన బైబిల్ క్విజ్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన మహిళలకు బహుమతులు అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో చర్చి కమిటీ సభ్యులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# టీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌కు మాతృవియోగం

మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి సెప్టెంబర్ 13 (ప్రజాకలం) కోరుట్ల టీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌కు మాతృవియోగం సంభవించింది. ఆయన తల్లి అనారోగ్యంతో మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు, పార్టీ నాయకులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. డాక్టర్ రఘును పలువురు నాయకులు



పరామర్శించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

డాక్టర్ రఘు తల్లి మృతికి ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పరామర్శ

కోరుట్ల: తెలంగాణ రక్షణ సేన కోరుట్ల నియోజకవర్గ ఇంచార్జి, నాయకులు డాక్టర్ రఘు తల్లి అనారోగ్యంతో మృతి చెందడంతో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నందయ్య, జగిత్యాల పట్టణ నాయకులు సమీండ్ల శ్రీనివాస్ వారి కుటుంబాన్ని పరామర్శించారు.ఈ సందర్భంగా మృతురాలి చిత్రపటానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆమె మృతి పట్ల ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తూ, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అక్షయ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత మట్టి వినాయక ప్రతిమల పంపిణీ

ఇబ్రహీంపట్నం సెప్టెంబర్ 13 ( ప్రజా కలం ప్రతినిధి)
పర్యావరణ పరిరక్షణలో భాగంగా అక్షయ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతి




ఏటా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మట్టి వినాయక ప్రతిమల ఉచిత పంపిణీ కార్యక్రమం ఈ ఏడాది కూడా సిద్ధమైంది. 2021లో సంస్థ స్థాపించిన సందర్భాన్ని పురస్కరించుకుని మొట్టమొదటి కార్యక్రమంగా ప్రారంభమైన ఈ పర్యావరణ హిత ఉద్యమం, ప్రజల ఆదరణతో దిగ్విజయంగా కొనసాగుతూ ఇప్పుడు వరుసగా 6వ సంవత్సరంలోకి అడుగుపెట్టింది.వినాయక చవితి పండుగను పురస్కరించుకుని, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ ( పి ఓ పి), రసాయన రంగుల విగ్రహాల వల్ల జరిగే కాలుష్యాన్ని నివారించడమే ధ్యేయంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతోంది.గ్రామ పంచాయితీ ఆవరణ లో జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోఈ పర్యావరణ పరిరక్షణ మహత్కార్యంలో భాగస్వాములు అయ్యారు. ఇబ్రహీంపట్నం పరిసర ప్రాంతాల ప్రజలు, భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేసారు.అక్షయ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో జరిగింది. ఇబ్రహీంపట్నం.ముఖ్య అతిథి ఇబ్రహీంపట్నం ఎస్సై జి నవీన్ కుమార్ పాల్గొన్నారు.అధ్యక్షులు ప్రవీణ్ సభ్యులు లక్ష్మణ్ రామ్ రమేష్ రాజు శ్రీనివాస్ ప్రతాప్ రామ్ రెడ్డి. తదితరులు పాల్గొన్నారు



## చెక్‌డ్యామ్ కరకట్ట కొట్టుక పాయె

# ప్రజాధనం నీటీ పాలు ఆయె!

నర్సింహులపేట, సెప్టెంబర్ 13 (ప్రజా కలం ప్రతినిధి)

నర్సింహులపేట మండలం జయపురం గ్రామ శివారులోని ఆకేరు వాగుపై నిర్మించిన చెక్‌డ్యామ్ కరాకట్ట రెండేళ్ల క్రితం కురిసిన భారీ వర్షాల





వరద తాకిడికి కొట్టుకుపోయింది. దెబ్బతిన్న కరాకట్టకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టేందుకు టెండర్ ద్వారా రూ.5,88,461 కాంట్రాక్ట్ విలువతో పనులు చేపట్టినట్లు సమాచారం.ఉంది అయితే, గుత్తేదారు నాసిరకంగా పనులు చేయడంతోనే తాజాగా కురిసిన సాధారణ వర్షానికే ఆకేరు వాగు ప్రవహించి, మరమ్మతులు చేసిన కరాకట్ట భాగం మళ్లీ కొట్టుకుపోయిందని రైతులు ఆరోపిస్తున్నారు.

అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగానే నాసిరకం పనులు జరిగాయని, ప్రజాధనం వృథా అయిందని ఆకేరు వాగు శివారు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రూ.5.88 లక్షలకు పైగా వెచ్చించిన పనులు కొద్దిపాటి వర్షానికే దెబ్బతినడంపై అధికారులు స్పందించి, పనుల నాణ్యతపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని రైతులు శాశ్వత పరిష్కారం తీసుకోవాలని కోరుతున్నారు.

## వినాయకుడి ఆశీస్సులతో గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి

### -స్థానిక సర్పంచ్ వాసం సుస్మిత

ఆళ్లపల్లి, సెప్టెంబర్ 13, (ప్రజాకలం)

ఆళ్లపల్లి గ్రామ పంచాయతీ ప్రజలందరికీ స్థానిక సర్పంచ్ వాసం సుస్మిత వినాయక చవితి పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. వినాయకుడి ఆశీస్సులతో ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు,




ఆయురారోగ్యాలు, శాంతి, సౌభాగ్యాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. విఘ్నాలను తొలగించి విజయాలను ప్రసాదించే విఘ్నేశ్వరుడిని భక్తిశ్రద్ధలతో పూజించాలని ప్రజలకు సూచించారు.వినాయక చవితి సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సర్పంచ్ సుస్మిత కోరారు. మట్టి గణపతి విగ్రహాలను పూజించడంతో పాటు ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు దూరంగా ఉండాలని సూచించారు. గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, పరస్పర సోదరభావంతో ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా జాగ్రత్తలు పాటించాలని కోరారు.వినాయకుడి కృపతో ఆళ్లపల్లి గ్రామం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని, గ్రామ ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో జీవించాలని సర్పంచ్ వాసం సుస్మిత ఆకాంక్షించారు.

## సారయ్య కుటుంబానికి ఈగ దామోదర్ పరామర్శ

### -కష్టకాలంలో అండగా ఉంటాం.. పార్టీ నాయకులు, కార్యకర్తలు భరోసా.-ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు ఆదేశాలతో నిత్యావసర సరుకులు, ఆర్థిక సాయం అందజేత.

(వరంగల్ /వర్ధన్నపేట) సెప్టెంబర్ 13 ప్రజాకలం ప్రతినిది:

వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని మూడో డివిజన్‌కు చెందిన కందిక సారయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వర్ధన్నపేట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఈగ దామోదర్ శనివారం సారయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు.గౌరవ ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు ఆదేశాల మేరకు సారయ్య కుటుంబాన్ని కలిసి వారి పరిస్థితులను దామోదర్ అడిగి తెలుసుకున్నారు. కుటుంబానికి తనవంతు సహాయంగా బియ్యం, వంటనూనె తదితర నిత్యావసర సరుకులతో పాటు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దామోదర్ మాట్లాడుతూ.. సారయ్య మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కష్టకాలంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు కుటుంబానికి అండగా ఉంటారని, అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు ముందుంటామని భరోసా ఇచ్చారు.కార్యక్రమంలో మూడో డివిజన్ అధ్యక్షుడు కొండేటి సుధాకర్, మాజీ కౌన్సిలర్ తుమ్మల రవీందర్, ఐత సుధాకర్, కొండేటి మహేందర్, నందిపాక భాస్కర్, విలాసారపు వెంకట్, ఎండీ సోహెల్, ముంజ కృష్ణ, కొండేటి అఖిల్, కొండేటి ప్రమోద్ తదితర పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.



## రావిరాల గ్రామ ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపిన సర్దార్ పటేల్ యువజన సంఘం కల్చరల్ సెక్రటరీ పాల్వాయి సత్యనారాయణ

మహేశ్వరం, సెప్టెంబర్ 13,(ప్రజా కలం)

రావిరాల సర్దార్ పటేల్ యువజన సంఘం సభ్యులకు రావిరాల గ్రామ ప్రజలకు సర్దార్ పటేల్ యువజన సంఘం కల్చరల్ సెక్రటరీ పాల్వాయి సత్యనారాయణ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా



సత్యనారాయణ మాట్లాడుతూ వినాయక చవితి పండుగ హిందూ ప్రజలు ఎంతో ఇష్టంగా భక్తిశ్రద్ధలతో సంతోషంగా నిర్వహించుకుంటారని అదేవిధంగా నవరాత్రులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి ఘనంగా గణేష్ నిమజ్జనం చేయడం జరుగుతుందని అన్నారు. భక్తిశ్రద్ధలతోపాటు ప్రతి ఒక్కరు తగు జాగ్రత్తలు తీసుకుంటూ ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎక్కడ ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ప్రశాంతంగా శాంతియుతంగా నిర్వహించాలని అదేవిధంగా తమ భక్తుని చాటుతూ ఈ సంవత్సరం వినాయక చవితి అంగరంగబయోభంగా నిర్వహించాలని ఆయన కోరారు. గ్రామ ప్రజలకు, సంఘం సభ్యులందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు.

# ఖమ్మంలో జనసేన శంఖారావం

## హోరెత్తిన భారీ బైక్ ర్యాలీ.. 'జై జనసేన' నినాదాలతో మారుమోగిన నగరం

## పట్టభద్రుల సమస్యలపై శాసనమండలిలో పోరాడతా: గడల శ్రీనివాసరావు






ఖమ్మం, సెప్టెంబరు 13 (ప్రజాకలం న్యూస్):

జనసేన పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'తెలంగాణ శంఖారావం' సభ, భారీ బైక్ ర్యాలీ శనివారం ఖమ్మంలో ఉత్సాహంగా సాగాయి. వేలాది మంది జనసైనికులు, వీర మహిళలు, యువతీ యువకులు పాల్గొనడంతో నగర వీధులు 'జై జనసేన', 'జై పవన్ కల్యాణ్' నినాదాలతో మారుమోగాయి. ఖమ్మం--వరంగల్--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల జనసేన అభ్యర్థి, ఉమ్మడి ఖమ్మం జిల్లా కో-ఆర్డినేటర్, పార్టీ అధికార ప్రతినిధి డాక్టర్ గడల శ్రీనివాసరావు సమన్వయంతో కార్యక్రమాలు నిర్వహించారు.

**భారీ బైక్ ర్యాలీ**

ఖమ్మంలోని ఎస్ఆర్అండ్ బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం నుంచి బైక్ ర్యాలీ ప్రారంభమైంది. బైపాస్ రోడ్డు, ఎన్టీఆర్ సర్కిల్, నూతన బస్టాండ్, రాపర్తినగర్ మీదుగా పద్మశ్రీ వనజీవి రామయ్య ప్రాంగణం వరకు కొనసాగింది. జనసేన జెండాలతో భారీగా తరలివచ్చిన కార్యకర్తలతో నగరంలో సందడి నెలకొంది.

**గిరిజన బాలిక కుటుంబానికి అండగా..**

ములకలపల్లి మండలం చౌటప్పగూడెం గ్రామానికి చెందిన గిరిజన బాలిక ఇటీవల హత్యకు గురైన ఘటనను సభలో జనసేన నేతలు తీవ్రంగా ఖండించారు. బాధితురాలి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం బాలిక కుటుంబ సభ్యులను వేదికపైకి ఆహ్వానించి ఓదార్చారు. నిందితులకు కఠిన శిక్ష పడే వరకు న్యాయపోరాటం కొనసాగిస్తామని, బాధిత కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

**జానకమ్మకు సత్కారం**

పద్మశ్రీ పురస్కార గ్రహీత దివంగత వనజీవి రామయ్య స్మారకార్థం సభా వేదికకు 'పద్మశ్రీ వనజీవి రామయ్య ప్రాంగణం'గా నామకరణం చేశారు. ఈ సందర్భంగా రామయ్య సతీమణి జానకమ్మను జనసేన రాష్ట్ర నాయకత్వం శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేసింది. పర్యావరణ పరిరక్షణలో రామయ్య చేసిన సేవలను నేతలు కొనియాడారు.

**పట్టభద్రుల సమస్యలపై పోరాడతా**

సభలో ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ గడల శ్రీనివాసరావు మాట్లాడుతూ.. నిరుద్యోగ యువత, పట్టభద్రులు, విద్యావేత్తల సమస్యలపై శాసన మండలిలో బలమైన గొంతుకగా నిలుస్తానని అన్నారు. క్రమం తప్పకుండా జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని, నిరుద్యోగ భృతి అందించాలని, పోటీ పరీక్షల ఫీజులు రద్దు చేయాలని పోరాడతానని తెలిపారు. కేజీ నుంచి పీజీ వరకు నాణ్యమైన విద్య అందేలా ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

**పార్టీని బలోపేతం చేస్తాం**

జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి తాళ్లూరి రామ్, తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి నేమూరి శంకర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి సాగర్ ఆర్.కె. నాయుడు తదితరులు మాట్లాడుతూ.. తెలంగాణలో జనసేనను బలోపేతం చేసి ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతామని తెలిపారు.

**భారీగా తరలివచ్చిన జనసైనికులు**

సభకు ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు తెలంగాణలోని వివిధ జిల్లాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు, పవన్ కల్యాణ్ అభిమానులు తరలివచ్చారు. భారీ బైక్ ర్యాలీ, బహిరంగ సభతో ఖమ్మంలో జనసేన తన రాజకీయ బలాన్ని ప్రదర్శించింది.

## వెదురు వృత్తిదారులంతా తరలిరావాలి

### -ప్రపంచ వెదురు దినోత్సవాన్ని విజయవంతం చేయాలి.

### -మేదరి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దీకొండ ఉపేందర్.

(వరంగల్/వర్దన్నపేట) సెప్టెంబర్ 13 ప్రజాకలం ప్రతినిది:

ప్రపంచ వెదురు దినోత్సవం సందర్భంగా ఈ నెల 18న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించనున్న కార్యక్రమానికి వరంగల్ జిల్లాలోని మేదరి సోదర సోదరీమణులు, వెదురు వృత్తిదారులు, సంఘం కమిటీ సభ్యులు, ఉద్యోగులు, మేధావులు, విద్యార్థులు, మహిళలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వరంగల్ జిల్లా మేదరి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దీకొండ ఉపేందర్ పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర మేదరి మహేంద్ర సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ వెదురు దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వెదురు మేదరి వృత్తికి ప్రధాన ఆధారమని, తరతరాలుగా ఈ వృత్తిపై ఆధారపడి అనేక కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు మేదరి వృత్తిదారులకు ఉపాధి కల్పించేలా వెదురు సాగును ప్రభుత్వం మరింత ప్రోత్సహించాలని ఉపేందర్ కోరారు. వెదురు ఆధారిత ఉత్పత్తులకు మార్కెట్ సౌకర్యం, వృత్తిదారులకు ప్రోత్సాహకాలు కల్పిస్తే మేదరి వృత్తిని మరింత బలోపేతం చేయవచ్చన్నారు.



ఈ కార్యక్రమంలో మేదరి సంఘం నాయకులు, వృత్తిదారులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.వెదురును పెంచుదాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం.. మేదరి వృత్తిని బలోపేతం చేద్దాం అని ఉపేందర్ పిలుపునిచ్చారు.

## ఎంబీబీఎస్ ర్యాంకర్ అఖిలకు ఆర్థిక చేయూత

### -విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించడమే లక్ష్యం: ఈగ దామోదర్.

(వరంగల్/వర్దన్నపేట) సెప్టెంబర్ 13 ప్రజాకలం ప్రతినిది:

వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని 3వ వార్డుకు చెందిన కొండేటి అఖిల (భాస్కర్ కుమార్తె) ఎంబీబీఎస్‌లో ర్యాంక్ సాధించడం అభినందనీయమని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఈగ దామోదర్ అన్నారు. అఖిల సాధించిన విజయాన్ని తెలుసుకున్న ఆయన ఆమెను ప్రత్యేకంగా అభినందించి, బెస్ట్ ఆఫ్ లక్ తెలిపారు.అఖిల ఉన్నత విద్యను కొనసాగిస్తూ భవిష్యత్‌లో మరిన్ని విజయాలు



సాధించాలని ఆకాంక్షిస్తూ తనవంతుగా ఆర్థిక సహాయాన్ని అందించి ప్రోత్సహించారు. విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించి, వారి ఉన్నత విద్యకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఈగ దామోదర్ పేర్కొన్నారు. అఖిల పట్టుదలతో చదివి వైద్యరంగంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ 3వ డివిజన్ అధ్యక్షుడు కొండేటి సుధాకర్, మాజీ కౌన్సిలర్ తుమ్మల రవీందర్, అయితే సుధాకర్, నందిపాక భాస్కర్, కొండేటి మహేందర్, సింగారపు సుమన్, విలాసారపు వెంకట్, ఎండి సోషల్, ముంజ కృష్ణ, కొండేటి అఖిల్, కొండేటి సందీప్, యూత్ నాయకులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ విమోచన దినోత్సవం అధికారికంగా జరపాలి

## బిజెపి జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర గౌడ్

బెల్లంపల్లి టౌన్, సెప్టెంబర్ 13, (ప్రజాకలం) ప్రతినిధి..

సెప్టెంబర్ 17న తెలంగాణ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను అధికారంకంగా నిర్వహించకుండా తెలంగాణ ప్రజలను కాంగ్రెస్, బి.ఆర్.ఎస్ ప్రభుత్వాలు వంచనకు గురి చేశాయని బిజెపి జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ అన్నారు. ఆదివారం బెల్లంపల్లి టేకుల బస్తి కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే అమరాజుల శ్రీదేవి తో కలిసి పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణతో పాటు స్వతంత్రం వచ్చిన ప్రాంతాలలో కర్ణాటక, మహారాష్ట్ర, ప్రభుత్వాలు స్వాతంత్ర దినోత్సవ వేడుకలు అధికారికంగా నిర్వహిస్తున్నాయని, తెలంగాణలో రాజకీయ పార్టీలు మైనార్టీ సంతోష్టీకరణ విధానం అవలంబిస్తూ ఈ వేడుకలను నిర్వహించడంలో అలసత్వం వహిస్తున్నాయని ఆయన అన్నారు.తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ తెలంగాణ ప్రజలకు సెప్టెంబర్ 17 అధికారికంగా నిర్వహిస్తామని ప్రకటించి తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేవలం గోల్కొండ ఖిలాపై ఉత్సవాలు నిర్వహించి చేతులు దులుపుకున్నారని ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ ప్రజా పాలన దినోత్సవం పేరుతో అసలైన స్వతంత్ర దినోత్సవ వేడుకలను మరుగున పడేయడానికి ప్రయత్నం చేస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజల అభీష్టశీ మేరకు కేంద్ర ప్రభుత్వం 2023 నుండి హైదరాబాద్ పెరేడ్ గ్రౌండ్స్ లో తెలంగాణ విమోచన దినోత్సవం అధికారికంగ నిర్వహిస్తుందన్నారు. ఇదే తరహాలో రాష్ట్ర ప్రభుత్వం కూడా అధికారికంగా తెలంగాణ విమోచన దినోత్సవం నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. సెప్టెంబర్13 1948న సర్దార్ వల్లభాయ్ పటేల్ ప్రారంభించిన ఆపరేషన్ పోలో విజయవంతమై సెప్టెంబర్ 17 1948న స్వాతంత్రం వచ్చిన విషయాన్ని 13 నెలల పాటు తెలంగాణ ప్రజలు అధికంగా అనుభవించిన బానిస జీవితాన్ని తెలంగాణ పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శులు రాచర్ల సంతోష్, కుమార్ వైద్య శ్రీధర్, బెల్లంపల్లి పట్టణ అధ్యక్షురాలు ధార కళ్యాణి, సీనియర్ నాయకులు దూది ప్రకాష్, జీదుల రాములు, జిల్లా మహిళా మోర్చా నాయకురాలు నల్లుల సంగీత, పట్టణ ప్రధాన కార్యదర్శి ఎర్రోజు శ్రీనివాస్, ఉపాధ్యక్షులు గాండ్ల మహేష్, బాగ్ మోహన్, పుల్లూరి రాము, పట్టణ కార్యదర్శి దుర్గం కృష్ణ బీసీ మోర్చా పట్టణ అధ్యక్షులు సుక్క మల్లేష్ ఎస్సీ మోర్చా పట్టణ అధ్యక్షులు ఇప్ప స్వామి,మైనార్టీ మోర్చా పట్టణ అధ్యక్షులు షేక్ గౌస్ బాబా,ఎస్టీ మోర్చా పట్టణ అధ్యక్షులు బానోతు సుధాకర్ మహిళా నాయకురాలు చింతకింది లావణ్య, పుల్లె ప్రశాంత్ కార్యకర్తల మరియు నాయకులు పాల్గొన్నారు.



## మట్టి గణపతి నీ పూజిద్దాం పర్యావరణాన్ని కాపాడుదాం: బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్

బెల్లంపల్లి టౌన్, సెప్టెంబర్ 13, (ప్రజా కలం) ప్రతినిధి..

జనహిత సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం చేపట్టిన ఉచిత మట్టి గణపతి పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, మున్సిపల్ చైర్ పర్సన్ దావా స్వాతి రమేష్ పాల్గొన్నారు. ప్రజలకు ఉచిత మట్టి గణపతిలను పంపిణీ చేశారు.. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గడ్డం వినోద్ మాట్లాడుతూ మట్టి వినాయకులను పర్యావరణాన్ని కాపాడాలని ప్రజలకు సూచించారు . భక్తిశ్రద్ధలతో ,శాంతియుత వాతావరణం లో గణపతి నవరాత్రులను జరుపుకోవాలని పేర్కొన్నారు. అనంతరం మున్సిపల్ చైర్ పర్సన్ దావ స్వాతి రమేష్ మాట్లాడుతూ ప్రజలు మట్టి గణపతిలను పూజించి పర్యావరణాన్ని కాపాడాలని, గణపతి నవరాత్రులను భక్తిశ్రద్ధలతో,శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు..కార్యక్రమంలో మాజీ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ కారుకూరి రామ్ చందర్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గెల్లి రాజలింగు, నాయకులు నీలి కృష్ణ, శంకర్ సింగ్, హరీష్, రత్నం ప్రదీప్, జనహిత సేవాసమితి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు...



# ఒకే గ్రామం.. ఒకటే గణపతి

- ఆరు దశాబ్దాల ఐక్యతకు సజీవ సాక్ష్యం భోసి 'కర్ర గణేశుడు'!
-నేడే శ్రీ వరసిద్ధి కర్ర వినాయకుని ప్రతిష్ఠాపన -భక్తిశ్రద్ధలతో దీక్షల స్వీకరణ
-1963 నుంచి నిరాటంకంగా సాగుతున్న అరుదైన సాంప్రదాయం
-కర్ర విగ్రహంతోనే ఊరంతా ఒక్కటై ఊరేగే అద్భుత ఆధ్యాత్మిక ఘట్టం





తానూర్, సెప్టెంబర్ 13 (ప్రజా కలం ప్రతినిధి)
నేటి రోజుల్లో వీధికో వినాయకుడు, వాడకో మండపం కనిపిస్తాయి, కానీ, నిర్మల్ జిల్లా తానూర్ మండలం 'భోసి' గ్రామం మాత్రం శతాబ్దపు ఐక్యతకు, ఆధ్యాత్మిక నిష్ఠకు ప్రతిరూపంగా నిలుస్తోంది, ఊరంతా కలిపి ఒక్కటే వినాయకుడిని ప్రతిష్ఠించడం ఇక్కడి ప్రత్యేకం,మహారాష్ట్ర సరిహద్దుకు ఉన్న ఈ చిన్ని గ్రామం, 1963 నుంచి 'ఒకే ఊరు – ఒకే గణపతి' అనే విశిష్ట ఆచారాన్ని పాటిస్తూ ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తోంది.

**అరుదైన 'కర్ర గణేశుడు'.. ఆలయంలో భద్రత**

సాధారణంగా ఏటా కొత్త మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించి నిమజ్జనం చేయడం చూస్తుంటాం,కానీ భోసి గ్రామస్తులు 1963లో అత్యంత భక్తిశ్రద్ధలతో చెక్కించిన 'కర్ర వినాయకుడిని' ఇప్పటికీ పూజిస్తుండటం విశేషం, నవమి ఉత్సవాల వేళ ఆలయంలో ప్రత్యేకంగా నిర్మించిన బీరువా నుంచి స్వామివారిని బయటకు తీసి మహా వైభవంగా ప్రతిష్ఠిస్తారు, 11 రోజుల పాటు ఈ అరుదైన (కర్ర) వరసిద్ది గణపతిని దర్శించుకోవడానికి స్థానికులే కాకుండా పొరుగు రాష్ట్రం నుంచి కూడా భక్తులు పారవశ్యంతో తరలివస్తారు.

**అందరూ ఒకే మాల.. ఇల్లంతా ఒకే పండుగ!**

ఈ గ్రామంలో నవరాత్రుల వేళ ఊరంతా ఒకే కుటుంబంగా మారిపోతుంది, గ్రామంలోని భక్తులందరూ ఒకే వేదికపై గణపతి దీక్షలు స్వీకరిస్తారు,ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం జరిగే ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో మాలాధారులతో పాటు వారి కుటుంబ సభ్యులంతా కలిసి పాల్గొని స్వామివారిని అర్పిస్తారు, గ్రామంలోని ప్రతి ఇల్లూ ఈ 11 రోజులు ఒకే ఉత్సవ శోభను సంతరించుకుంటుంది.

**-వరసిద్ధుడి కృప.. ఊరంతా ఉద్యోగాల పంట!**

ఒకప్పుడు కేవలం వ్యవసాయంపైనే ఆధారపడిన భోసి గ్రామం, ఈ వరసిద్ధి వినాయకుడి ఆశీస్సులతో నేడు రూపురేఖలు మార్చుకుంది, స్వామివారి దయవల్ల ప్రతి రైతు కుటుంబం నుంచి ఒకరికి ఉద్యోగం వరించిందని, ప్రస్తుతం గ్రామంలో 130 మందికి పైగా ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారని స్థానికులు గర్వంగా చెబుతారు, విద్యార్థులు సైతం స్వామిని వేడుకుని ఐఐటీ, వైద్య, పోటీ పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు సాధిస్తున్నారని నమ్ముతారు.

-నేటి నుంచి ఉత్సవాలు ప్రారంభం కానుండటంతో గ్రామంలో ఆధ్యాత్మిక ఉత్సాహం వెల్లివిరుస్తోంది. ఈ ఏడాదీ ఐక్యతా నినాదంతో వరసిద్ధుడిని కొలవడానికి భోసి వాసులు ఘనంగా సిద్ధమయ్యారు.



## మట్టి గణపతులతో పర్యావరణ పరిరక్షణ

### ప్రతి ఒక్కరూ మట్టి వినాయకుడినే పూజించాలి

### : బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు మల్లిక అశోక్

టేక్మాల్, సెప్టెంబరు 14 (ప్రజాకలం న్యూస్):
పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మట్టి గణపతులను పూజించాలని భాజపా మెదక్ జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు డాక్టర్ పట్లోళ్ల మల్లిక అశోక్ పిలుపునిచ్చారు. ఆమె ఆధ్వర్యంలో టేక్మాల్ మండలంలోని టేక్మాల్ గ్రామంలో మట్టి గణపతులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మల్లిక అశోక్ మాట్లాడుతూ.. రసాయనాలు, రంగులతో తయారు చేసిన వినాయక విగ్రహాలను నిమజ్జనం చేయడం వల్ల నీటి వనరులు కలుషితమవుతాయని తెలిపారు. రసాయనాల ప్రభావంతో జలచరాలు, చేపలకు ప్రాణహాని కలిగే ప్రమాదం ఉందన్నారు. కలుషిత నీటిని వినియోగించడం, ఆ నీటిలోని చేపలను తినడం వల్ల ప్రజల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు తమ వంతుగా ప్రతి సంవత్సరం మట్టి గణపతులను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ప్రజలంతా మట్టి వినాయకులను పూజించి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భక్తుల వరలక్ష్మి, స్వరూప, శిరీష, లక్ష్మి, రాజేశ్వరి, సరస్వతి, శోభ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## యువ నాయకత్వాన్ని ప్రోత్సహించడం అభినందనీయం

### - పట్టణ యువజన అధ్యక్షుడు కూరకుల శ్రీకాంత్‌కు ఘన సన్మానం

గజ్వేల్:13సెప్టెంబర్ 2026 (ప్రజా కలం ప్రతినిధి)
యువతకు రాజకీయాల్లో ప్రాధాన్యత కల్పిస్తూ యువ నాయకత్వాన్ని ప్రోత్సహిస్తున్న తెలంగాణ రక్షణ సేన పార్టీ నాయకత్వానికి ఆసరా సేవా సమితి సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. గజ్వేల్--ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పట్టణ



యువజన అధ్యక్షుడిగా ఇటీవల నియమితులైన ఆర్అండ్ఆర్ కాలనీ 12వ వార్డు ఏటిగడ్డ కిష్టాపూర్‌కు చెందిన కూరకుల శ్రీకాంత్‌ను ఆసరా సేవా సమితి సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సమితి సభ్యులు మాట్లాడుతూ యువత రాజకీయంగా,సామాజికంగా ఎదిగేందుకు అవకాశాలు కల్పించడం అభినందనీయమన్నారు. యువతను ముందుకు తీసుకెళ్లేందుకు తెలంగాణ రక్షణ సేన చేస్తున్న కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు.
పట్టణ యువజన అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన కూరకుల శ్రీకాంత్ యువతను సమన్వయం చేసుకుంటూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టి ప్రజలకు సేవ చేయాలని శుభాకాంక్షలు తెలిపారు.శ్రీకాంత్‌కు బాధ్యతలు అప్పగించిన తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత,గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొట్టాల యాదగిరికి ఆసరా సేవా సమితి సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ప్రజా సేవే లక్ష్యంగా ముందుకు సాగుతున్న శ్రీకాంత్‌కు అన్ని వర్గాల ప్రజల సహకారం,ఆశీస్సులు లభించాలని వారు ఆకాంక్షించారు.

### మరాఠీ కృష్ణమూర్తిని పరామర్శించిన బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు

### త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన కలాల శ్రీనివాస్

గజ్వేల్, సెప్టెంబర్ 13 (ప్రజా కలం ప్రతినిధి)
తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, బీఎంఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మరాఠీ కృష్ణమూర్తిని బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు కలాల శ్రీనివాస్ పరామర్శించారు.నాలుగు రోజుల క్రితం జరిగిన బైక్ ప్రమాదంలో స్వల్ప గాయాలపాలై చికిత్స అనంతరం ఇంటికి చేరుకున్న కృష్ణమూర్తి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.కృష్ణమూర్తి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ సందర్భంగా ధైర్యంగా ఉండాలని, ఆరోగ్యంపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రాణే మద్రాస్ లిమిటెడ్ ప్రజ్ఞాపూర్ బీఎంఎస్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీశైలం,యాదగిరి, శ్రీనివాసచారి, బీఎంఎస్ యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.






## దేశ రాజకీయాల్లో క్రియాశీలక పాత్ర పోషించిన ఏచూరి

ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) సిపిఎం అఖిల భారత పూర్వ కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి రెండో వర్ధంతి సభ ప్రగతినగర్ సుందరయ్య భవన్లో ఆదివారం సాయంత్రం 6 గంటలకు సిపిఎం బాచుపల్లి మండల కార్యదర్శి కామ్రేడ్ బి వెంకటరామయ్య అధ్యక్షతన జరిగింది. సీతారాం ఏచూరి చిత్రపటానికి జిల్లా కార్యదర్శి పి.సత్యం పూలమాల వేసి నివాళులు అర్పించారు, హాజరైన ప్రజలు సంతాపం తెలిపారు.
ఈసందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి పి.సత్యం మాట్లాడుతూ... దేశంలోని యువతకు ఆదర్శంగా నిలిచిన వ్యక్తి అన్ని రాజకీయ పార్టీలకు తలలో నాలుక లాగా నిలిచి దేశంలో రాజకీయాల్లో బిజెపిని ఓడించటానికి శాయశక్తుల కృషి చేసి ఇండియా కూటమి ఏర్పడేలాగా చూశారు. 1975 -77 సమయంలో ఇందిరా గాంధీని వైస్ ఛాన్సర్ గా రాజీనామా చేయించారు. యూపీఎ వన్ లో మనం క్రియాశీలకమైన చట్టాలను రూపొందించడంలో ఏచూరి ప్రధాన పాత్ర పోషించారు. నూతన ఆర్థిక విధానాలు నూతన విద్యా విధానం నూతన వ్యవసాయ చట్టాలను వ్యతిరేకించడం ద్వారా పార్లమెంట్లో చివరి కంఠ పోరాడారు.
ఈదేశంలోని కుల వ్యవస్థపై పోరాడుతూ నిర్దేష్టంగా అన్వయించి దేశంలోని అసమానతలను వ్యతిరేకంగా పోరాడాలని చెప్పారు. పార్లమెంట్లో, రాజ్యసభ సభ్యుడిగా దేశంలో బీజేపీని ఎదుర్కొని తన కుటుంబ చరిత్రను చెప్పి మతోన్మాదం తిప్పి కొట్టాడు. తన కుటుంబంలో అన్ని మతాలు ఉన్నాయి మతాలు, కులాలు కావు, భారతీయుణ్ణి అనేది ప్రధానంగా ప్రచారం చేశారు. జంజీ ఉద్యమంతో మార్పు మొదలైంది దీనికి అందుకొని పోరాటం ముందుకు తీసుకెళ్లాలని సత్యం చెప్పారు. తెలకపల్లి రవి మాట్లాడుతూ.... కంప్లీట్ సీతారాం చూరి 1974 ,జెఎన్ టియు, లోనే జంజీ ఉద్యమం ప్రారంభించారు. ఆయన భారత శ్రామిక వర్గానికి పుత్రుడిని అనేవారు, జీవితాన్ని ఈదేశానికి అంకితం చేసిన వ్యక్తి, ధన్యజీవి బహుముఖమైన రూపాల్లో ఆయన కనబడతారు. 2024లో జంజితో సంబంధాలు, బీజాలు వేసిన వ్యక్తి 2019లో హైదరాబాద్ యూనివర్సిటీలో బిజెపి రహిత దెయ్యాలపై యూనివర్సిటీ మీద దాడి చేసింది. ప్రధానంగా హింసలపై దాడిని పార్లమెంటులో చాలా తీవ్రంగా చర్చల ద్వారా తిప్పి కొట్టారు. అధ్యయనం, పోరాటం ద్వారానే మన సమస్యలపై ప్రభుత్వాలపై పోరాడారు. పార్టీలో సూర్జిత్ ప్రధాన కార్యదర్శిగా ఉన్నప్పుడు కీలకమైన పాత్ర సీతారాం 1977లో ఇందిరా గాంధీని జేఎన్యు చాన్సులర్గా ఉండకూడదని రాజీనామా చేయించారు, వాజ్పాయ్ విధానంపై పుస్తకాలు రాశారు. ప్రస్తుత పరిస్థితుల్లో నరేంద్ర మోడీ, మోహన్ భగవాన్, చంద్రబాబు, రేవంత్ రెడ్డి వీళ్ళందరూ ఎందుకు జెన్ జి పాత్ర గురించి మాట్లాడుతున్నారంటే ప్రశ్నించే పరిస్థితి వచ్చింది, దీనికి కారణంగా సిజెఐ బొద్దింకలనే కామెంట్ ఆధారంగా చేసుకొని బొద్దింకల పార్టీ ఆందోళన ప్రచారం జరిగింది. అది పెద్ద ఎత్తున విద్యార్థులు ప్రజలు ఎందుకు వచ్చారు. మోడీ మన్ కి బాత్ స్థానంలో శిక్షిస్తున్నారని అంటే ఒక రకమైన భయం జెన్జీ వలన వచ్చిందన్నారు ఈకార్యక్రమంలో సిపిఎం పార్టీ కార్యదర్శి వర్గ సభ్యులు రాజశేఖర్, సీనియర్ నాయకులు శ్రీరాములు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.వెంకటరామయ్య, రాథోడ్ సంతోష్, లింగస్వామి, నరేష్, శంకర్, మండల కమిటీ నాయకులు బాల వెంకటేశ్వరరావు, నాగభూషణ్, భాస్కర్, బాలపీర్, స్వామి, పెంటయ్య, సిపిఎం నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

## ప్రజా సేవలో ఎస్సై రాఘవేందర్‌కు గుర్తింపు

### మహేశ్వరం పోలీస్ స్టేషన్ నుండి మల్కాజిగిరి కమిషనరేట్ కి బదిలీ

మహేశ్వరం, సెప్టెంబర్ 13, (ప్రజా కలం)
మహేశ్వరం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఏడాదిన్నర పాటు విధులు నిర్వహించిన ఎస్సై రాఘవేందర్ బదిలీపై మల్కాజిగిరి కమిషనరేట్ కి వెళ్లారు. ఈ సందర్భంగా మహేశ్వరం పోలీస్ స్టేషన్‌లో వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మహేశ్వరం ఎస్‌హెచ్‌ఓ రాఘవేందర్ రెడ్డి, పోలీసు సిబ్బంది, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేశ్వరం ఎస్‌హెచ్‌ఓ రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ఎస్సై రాఘవేందర్ ఏడాదిన్నర కాలంగా పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రజలకు ఎన్నో సేవలు అందించారని తెలిపారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో చొరవ చూపుతూ ప్రజల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్నారని అన్నారు. విధి నిర్వహణలో ఆయన అందించిన సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. బదిలీపై వెళ్తున్న ఎస్సై రాఘవేందర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే కార్యక్రమానికి హాజరైన మీడియా ప్రతినిధులకు ఎస్‌హెచ్‌ఓ రాఘవేందర్ రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పోలీసు శాఖకు, ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తూ వార్తలను ప్రజల్లోకి తీసుకెళ్తున్న మీడియా ప్రతినిధుల సేవలను అభినందించారు. అనంతరం ఎస్సై రాఘవేందర్ మాట్లాడుతూ.. తన పరిధికి వచ్చిన ప్రతి



సమస్యను సాధ్యమైనంత వరకు పరిష్కరించేందుకు ప్రయత్నం చేశామని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేశామని అన్నారు. విధి నిర్వహణలో సహకరించిన పోలీసు అధికారులకు, సిబ్బందికి, మీడియా ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు.ఎస్సై రాఘవేందర్ బదిలీ సందర్భంగా పోలీసు సిబ్బంది, మీడియా ప్రతినిధులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్సైలు ప్రసాద్, మారయ్యతో పాటు రాజకీయ నాయకులు,తదితరులు పాల్గొన్నారు.



## బీఆర్ఎస్ నేతలు రాజకీయ డ్రామాలు మానుకోవాలి: కల్వ సుజాత

ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత నియమితులయ్యారు. ఈసందర్భంగా మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ... బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వ్యక్తులు శాసనసభ స్పీకర్, ఆయన తల్లి, కులంపై అనుచిత వ్యాఖ్యలు చేయడం ఏమాత్రం సరికాదన్నారు. బీఆర్ఎస్ నేతలు అసెంబ్లీ కార్యక్రమాలను అడ్డుకుంటూ ప్రజా సమస్యలపై చర్చకు ఆటంకం కలిగిస్తున్నారని విమర్శించారు. అసెంబ్లీలో నిరసన తెలిపే అవకాశం ఉన్నప్పటికీ బయట మాక్ అసెంబ్లీ నిర్వహించడం కేవలం రాజకీయ డ్రామాగా ఆమె అభివర్ణించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్మాణాత్మకంగా వ్యవహరించాల్సిన ప్రతిపక్షం రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. 22ఏ భూముల అంశంపై ప్రభుత్వం ఇప్పటికే స్పష్టత ఇచ్చినప్పటికీ బీఆర్ఎస్ నేతలు కావాలనే ప్రజల్లో గందరగోళం సృష్టిస్తున్నారని కల్వ సుజాత అన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో అర్హులైన ప్రతి పౌరుడి ఓటు హక్కును పరిరక్షించేందుకు పార్టీ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కు సక్రమంగా ఉండేలా పార్టీ శ్రేణులు ప్రజలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. రాబోయే గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో మూడు కార్పొరేషన్లలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించి అన్ని స్థానాల్లో విజయకేతనం ఎగురవేస్తుందని ఆమె ధీమా వ్యక్తం చేశారు. మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా తనను నియమించిన పార్టీ అధిష్ఠానానికి, జిల్లా కాంగ్రెస్ కమిటీకి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈసమావేశంలో డీసీసీ కమిటీ సభ్యులు డివిజన్ అధ్యక్షులు, మహిళా జిల్లా అధ్యక్షురాలు, మహిళా డివిజన్ అధ్యక్షులు పాల్గొన్నారు.

## నేటి యువతకు చదువుతోపాటు క్రీడలు ఎంతో ముఖ్యం

### దళితరత్న అవార్డు గ్రహీత కాశమొల్ల కృష్ణ

హైద్రాబాద్ సెప్టెంబర్ 13(ప్రజాకలం న్యూస్)
అల్ ఇండియా 8వ కరాటే ఛాంపియన్షిప్ పోటీలు మహారాష్ట్ర తానే లోని మీహిర్ సీన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ జరిగాయి.ఈ పోటీలలో తెలంగాణ హైద్రాబాద్ కు కళ్యాణ్ మిక్స్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ విద్యార్థులు సత్తా చాటారు. శౌర్యావిరాజ్, వైష్ణవి,ఉదయకిరణ్,తన్విరెడ్డి, ప్రియాంక,శ్లోకం హానిష,డా; కళ్యాణ్ గౌడ్ మొత్తం 6గోల్డ్ మెడల్స్,5సిల్వర్, 1బ్రౌనజ్ సాధించారు.ఈ సందర్భంగా ప్రముఖ సంఘ సేవకులు దళితరత్న అవార్డు గ్రహీత కాశమల్ల కృష్ణ చేతుల మీదుగా విద్యార్థులకు ప్రశంసా పత్రం జ్ఞాపికలు అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు.



Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by **KALAKONDA RAMAKRISHNA**, Printed at **TEJOMAI PUBLICATION**, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013
Published from H.No.10-1-7, Bada Bazar, Beside Pothalingaiah Temple, Azam Raod, Nizamabad,TS -503001 TELANGANA - 503001.
Editor: **KALAKONDA RAMAKRISHNA, PRGI.No. TELTEL/2010/33275,** Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com